J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 37 14.02.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# కమలం కళకళ!

## మోదీ లాజిక్.. బీజేపీ మేజిక్
## దేశాన్ని కమ్మేస్తున్న కాషాయం

- తిరుగులేని శక్తిగా మారిన భారతీయ జనతా పార్టీ
- దేశం మొత్తం కమల వికాసమే ధ్యేయంగా వ్యూహాలు
- ఢిల్లీ గెలుపుతో పతాకస్థాయికి చేరిన చరిష్మా

పుష్కరకాలం ముందువరకు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాల్లోనూ ఒడిదొడుకుల ప్రయాణం సాగించిన పార్టీ.. వాజ్‌పేయి, ఎల్‌కే అద్వాని లాంటి దిగ్గజాల కష్టంపై ఎదిగినా.. ఇతర ప్రాంతీయ పక్షాలు కనికరిస్తే కానీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయలేని పార్టీ.. ఒకానొక దశలో రెండు పార్లమెంట్ స్థానాలకే పరిమితమైన పార్టీ... అయితే ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది.. కరుడుగట్టిన కాషాయవాదుల కృషితో ఇంతింతై.. వటుడింతై అన్నట్లు కొత్తశక్తిని నింపుకుని పరిపూర్ణత సాధించిన పార్టీ.. మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అండతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న పార్టీ..

10లో


# హస్తం విలవిల!

## కాంగ్రెస్.. ఖేల్ ఖతం
## నాయకత్వ లేమి.. భవితకి లేదు హామీ

- ఎన్నికల్లో నానాటికీ దిగజారుతున్న ఆ పార్టీ గ్రాఫ్
- ఇండియా కూటమిలో పేరుకే ప్రధాన పార్టీ
- పతనం దిశగా పయనం.. అంటున్న విశ్లేషకులు

ఆంగ్లేయుల గుండెల్లో దడపుట్టించి దేశానికి స్వాంతంత్ర్యం తెచ్చిపెట్టిన పార్టీ.. జాతీయవాద ఉద్యమాల్లో ప్రజలను ఏకతాటిపై నడిపించిన పార్టీ.. 75 ఏళ్ళ భారత చరిత్రలో దాదాపు 54ఏళ్ళు దేశాన్ని పరిపాలించిన పార్టీ.. ఒకానొక దశలో ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో కార్యకర్తలున్న పార్టీ.. ఏకకాలంలో అన్ని రాష్ట్రాలతో పాటు కేంద్రంలో అధికారం చెలాయించిన పార్టీ.. ఇదంతా గతం. నేడు 29 రాష్ట్రాలున్న దేశంలో మూడంటే మూడుచోట్ల అధికారానికి పరిమితమైన పార్టీ.. ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో ప్రాంతీయ పక్షాల ప్రాపకం కోసం పరితపించే పార్టీ.

10లో






# దైవకార్యాలను... అధికారులు బాధ్యతతో నిర్వహించాలి

## - శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమీక్షలో మంత్రి ఆనం



ఆలయాల నిర్వాహకులు, అధికారులు, సిబ్బంది అందరూ దైవకార్యాలను బాధ్యతతో చేపట్టాలని, ముఖ్యంగా బ్రహ్మోత్సవాల సందర్భంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. శ్రీశైలంలో అత్యంత వైభవంగా జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 10న ఆయన నలుగురు మంత్రులతో కలసి అధికారులు, స్థానిక నాయకులతో సమావేశమై ఏర్పాట్లను చర్చించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో దేవాలయాల్లో పారదర్శక నిర్వహణ గురించి, భక్తులకు కట్టుదిట్టమైన భద్రత పట్ల ప్రత్యేకదృష్టి సారించి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. భద్రత విషయంలో డ్రోన్‌ల సహాయం కూడా తీసుకోవాలని అధికారులకు చెప్పామన్నారు. ప్రతి దేవాలయంలో ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసే విధంగా పూజాకార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. భక్తులు దైవదర్శనానికి వచ్చే క్యూలైన్లలో మంచి నీరు, ఉపాహారం అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఉత్సవాల చివరి నాలుగు రోజుల్లో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని అందించేందుకు కూడా నిర్ణయించామన్నారు. ఈనెల 19 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 23న శ్రీశైలంలోని శ్రీ మల్లికార్జునస్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారని మంత్రి తెలియజేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవు



## బుచ్చి వైద్యసిబ్బందిని హెచ్చరించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

వైద్య సేవలకు సంబంధించి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, డాక్టర్లు..వైద్య సిబ్బందిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతమ్మ హెచ్చరించారు. పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని చెప్పారు. ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హాస్పిటల్ అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో వివిధ వార్డులలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాణాపాయ పరిస్థితులలో అత్యవసర వైద్య సేవల కోసం వచ్చే రోగుల సౌకర్యార్థం నైట్ షిఫ్టులో తప్పనిసరిగా డాక్టర్ల పర్యవేక్షణ వుండాలని ఆమె ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న అదనపు బ్లాక్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని ఆమె ఈ సందర్భంగా హామీ యిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం కమ్యూనిటి హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఏ సమస్య వచ్చినా.. నేనున్నానంటున్న కాకర్ల




ఉదయగిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తానున్నానంటూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజలకు భరోసా ఇస్తున్నారు. ఇటీవల వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించి 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల ప్రజలు ఈ కార్యక్రమానికి భారీసంఖ్యలో తరలివచ్చి కాకర్లకు తమ సమస్యలను విన్నవించి అర్జీలను ఇచ్చారు. అక్కడికక్కడే అధికారులతో ఆయన ఫోన్‌లు చేసి అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషిచేయడం ప్రజలను ఆకట్టుకుంది.

### కాకర్ల చేయూత

కొండాపురం మండలం వెలిగొండ్ల సమీపంలో ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మరణించిన వ్యవసాయ కూలీ షేక్ దిల్‌కుషా కుటుంబసభ్యులను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఇటీవల పరామర్శించారు. గరిమెనపెంట గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి వారికి ధైర్యం చెప్పడమే కాక, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరఫున 20వేల రూపాయలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# పాడిరైతులకు.. ప్రోత్సాహక బహుమతులు




అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామంలో విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సభ్యులతో ఈనెల 9న సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పి.కృష్ణమోహన్‌లు పాడిరైతులకు ప్రోత్సాహక బహుమతులను గిఫ్ట్‌లుగా అందజేశారు. పాడిరైతులు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ రంగ సంస్థల్లోని పాల డెయిరీలకు మాత్రమే పాలు పోయాలని ఈ సందర్భంగా కొండ్రెడ్డి రంగారెడ్డి రైతులకు సూచించారు. సీనియర్ నాయకులు శివయ్య, పాడిరైతులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవేస్ అథారిటీ ఛైర్మెన్‌తో.. బీఎంఆర్



ఇటీవల న్యూఢిల్లీలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మెన్ సంతోష్ కుమార్‌యాదవ్‌ను రాజ్యసభ సభ్యులు బీఎంఆర్ (బీద మస్తాన్‌రావు) మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉండే నెల్లూరు-తడ ఆరు రోడ్ల విస్తరణ, నెల్లూరు-ముంబై రహదారికి మరియు కావలి-సీతారామపురం రహదారులకు మధ్యలో ఉన్న సంఘం- కలిగిరి, ఆత్మకూరు - వింజమూరు, నందవరం-నందిపాడు మొదలగు అనుసంధాన రోడ్ల ఏర్పాట్ల గురించి, వాటి అవసరాల విషయమై ఆయనతో బీఎంఆర్ చర్చించారు.

# రాజ్యాంగాన్ని కాపాడుకుందాం!

## - పిలుపునిచ్చిన విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.రాజు



భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, 75 ఏళ్ల స్వతంత్ర భారతావనిని సమైక్యంగా ఉంచిన ఘనత మన రాజ్యాంగానిదేనని, అలాంటి రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యుసి) శాశ్వతసభ్యులు, నెల్లూరుజిల్లా పూర్వ కలెక్టర్ కె. రాజు పిలుపునిచ్చారు. ఏఐసీసీ సూచనలతో ఇటీవల నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ సదస్సు జరిగింది. విద్యార్థులు, యువకులు, సామాజికవేత్తలు, విద్యావేత్తలు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంతో ఘనమైన మన రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ నిర్మాతలను గౌరవించుకోవాలే తప్ప, అగౌరవపరచకూడదన్నారు. రాజ్యాంగ నిర్మాతల గురించి హేళనగా పార్లమెంట్‌లో మాట్లాడడం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. రాజ్యాంగంలో పేర్కొన్నవిధంగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని అన్ని వర్గాలపై ఉందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, దాని గొప్పతనాన్ని గ్రామస్థాయికి, మండల స్థాయికి కూడా తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఈ ఏడాది పాటు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుండి కలిగే ముప్పుపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నా మన్నారు. 'జై భీమ్-జై-బాపు, జై సంవిధాన్' పేరుతో జరిగే ఈ కార్యక్రమాలు ఈ ఏడాదంతా జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ నాగరాజు, మస్తాన్‌వలీ, ఉడతా వెంకట్రావు, ఎం.గోపాల్‌రెడ్డి. నరసింహ, నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఫయాజ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వియాని హోంకు..


# వివేకానంద వాకర్స్ విరాళం



నెల్లూరులోని వియాని హోం (వికలాంగుల ఆశ్రమం) నిర్వహణకు స్థానిక వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వారు ఇటీవల తమవంతు సాయంగా 20వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వాకర్స్ నాయకులు బెజవాడ. సునీల్‌రెడ్డి, రాఘవేంద్రషెట్టి, పొన్నం రవిచంద్ర, రాజా రమేష్ తదితరులు ఆ మొత్తాన్ని ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేందర్‌రెడ్డి, కోశాధికారి జీకే గోపినాథ్, గౌరవ అధ్యక్షులు మేకల నరేంద్రరెడ్డి, డాక్టర్ ఎంఎస్.రెడ్డి, డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్ బాబు, సుబ్బరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, ఓబుల్‌రెడ్డి, జయదేవ్, 203 డిస్ట్రిక్ట్ ఎలక్ట్ గవర్నర్-2025 నలుబోలు బలరామయ్యనాయుడు, వైవీ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కోటిసింగ్, ఖలీల్ బేగ్, నీలాద్రి, ప్రభాకర్, వెంకట్రావు, హుస్సేన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 15న కందుకూరుకు రానున్న..

# ముఖ్యమంత్రి చంద్రబాబు



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 15న కందుకూరుకి రానున్నారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడంలో భాగంగా ముఖ్యమంత్రి కందుకూరు వస్తున్నారు. ఈ సందర్భంగా దూబగుంట సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎంఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) యంత్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఉదయం 11.45కి కందుకూరుకి చేరుకోనున్న ముఖ్యమంత్రి, స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. తన పర్యటనలో భాగంగా దూబగుంటలోని అగ్రికల్చరల్ మార్కెట్‌యార్డ్‌లో గ్రామస్థులతో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2.30కి తిరిగి తాడేపల్లి వెళ్లిపోతారు.

# సోమశిల గేట్లు దెబ్బతిన్నాయ్!

### నిర్ధారించిన రాష్ట్ర సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు



జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల రిజర్వాయర్ గేట్లు దెబ్బతిన్నాయంటూ రైతులు ఎంతోకాలం నుంచి ఆందోళన చేస్తున్నా జలవనరుల శాఖ 'అదేం లేదు.. అంతా బాగానే ఉందంటూ' నిర్లక్ష్యం చేస్తుండడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, రాష్ట్ర జలవనరులశాఖ సాంకేతిక సలహాదారులు, ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణులు కన్నయ్యనాయుడు ఈనెల 12న సోమశిల రిజర్వాయర్‌ను పరిశీలించి, గేట్ల రోప్‌లు దెబ్బతిన్నాయని, రిజర్వాయర్‌ను ఇలాగే వదిలేస్తే తుంగభద్ర డ్యామ్‌కు పట్టిన గతే పడుతుందని సంబంధిత అధికార్లను మందలించారు. గేట్ల రోప్‌లను ఎన్నో ఏళ్ళుగా మార్చకపోవడంవల్ల గేట్లు దెబ్బతిన్నాయని, డ్యామ్ నిర్వహణ కూడా సరిగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్యామ్‌ను వెంటనే పటిష్టవంతం చేయాలంటూ సంబంధిత ఉన్నతాధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# ఎన్‌బికెఆర్‌లో అవగాహన సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 12న 'మానసిక సమస్యల'పై అవగాహన సదస్సు జరిగింది. నెల్లూరులోని ప్రముఖ వైద్యనిపుణురాలు డాక్టర్ జి.సుజిత ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులకు ఆరోగ్యం-మానసిక సమస్యలపై అవగాహన కలిగించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి, డా.సి.రవీంద్రరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.సి.ఉదయ కుమార్‌రాజు, డా.వి.హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా క్రీడాకారుల

# సమస్యలు తీర్చండి

### లోక్‌సభలో విపిఆర్



జిల్లాలోని క్రీడాకారుల సమస్యలు తీర్చండంటూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) లోక్‌సభలో గళమెత్తారు. మంగళవారం లోక్‌సభలో జీవోఅవర్ సందర్భంగా పలు అంశాలను సభ ముందుకు తెచ్చారు. ఖేల్ ఇండియా పథకం కింద జిల్లాలోని మొగళ్లపాలెం వద్ద నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ రన్నింగ్ ట్రాక్ లేకపోవడం వల్ల యువ అథ్లెట్లు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ అథ్లెటిక్ రన్నింగ్ ట్రాక్‌ని ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. క్రీడాప్రతిభకు పట్టంకడితే మరిన్ని పతకాలు సొంతం చేసుకోవచ్చన్నారు.

### రంగనాథునికి..

# బంగారు గరుడసేవ



నెల్లూరు రంగనాయకులపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామికి ఈనెల 12న మాఘపౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు వైభవోపేతంగా బంగారు గరుడసేవను నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు.

### నెల్లూరు రూరల్‌లో...

# 191 కోట్లతో అభివృద్ధి పనులు

### ఎం.ఎల్.ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వీడియో సందేశం!




కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 8 నెలల కాలంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 191 కోట్ల రూపాయల పనులు మంజూరై వివిధ దశలలో ఉన్నాయని రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం సాయంత్రం ఒక వీడియో సందేశం ద్వారా తెలిపారు. వాటిలో కొన్ని పనులు పూర్తయ్యాయని, కొన్ని జరుగుతున్నాయని, కొన్ని టెండర్ల దశలో ఉన్నాయని చెప్పారు. నగర కార్పొరేషన్ పరిధిలో ఉండే 26 వార్డులు, అలాగే రూరల్ పరిధిలోకి వచ్చే 18 గ్రామాలలో 101కోట్ల రూపాయలతో వివిధ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఇవన్నీ ప్రజల మౌలిక వసతులకి సంబంధించినవే అంటూ వాటి వివరాలని తెలియజేశారు. వీటితోపాటు ప్రధాన బైపాస్‌రోడ్డులోని రెండు కూడళ్ళలో 75 కోట్ల రూపాయలతో మంజూరైన వంతెన పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే, నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో 15కోట్లతో రోడ్డు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. గురువారం సాయంత్రం 7 గంటలకి తమ నాయకుడు సెల్ఫీవీడియో విడుదల చేయబోతున్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన అనుయాయులు ప్రచారం చేసుకున్నారు.

ఏదో జరగబోతోందని భావించిన రాజకీయవర్గాలు, మీడియా విభాగాలు శ్రీధర్‌రెడ్డి వీడియో చూసి ఊపిరి పీల్చుకున్నాయి. తాను చేసిన అభివృద్ధిపై విడుదల చేసిన వీడియోకి ఇలా కొత్తతరహా ప్రచారం కల్పించి ఆసక్తి రేకెత్తించడం స్టైల్ ఆఫ్ కోటంరెడ్డిగా శ్రీధర్ అభిమానులు అభివర్ణిస్తున్నారు.

# వల్లభనేని వంశీ అరెస్ట్



గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీని గురువారం ఉదయం పోలీసులు హైదరాబాదులో తమ అదుపులోకి తీసుకున్నారు. వైసీపీ హయాంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపైన జరిగిన దాడికి సంబంధించిన విషయంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్న సంగతి తెలిసిందే! తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సత్యవర్ధన్ అనే వ్యక్తి టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి గురించి పోలీసులకి ఫిర్యాదుచేశాడు. ఈ దాడిలో వంశీకి సంబంధించిన వ్యక్తులు ఎక్కువమంది ఉండడంతో, తమవారిని కేసునుండి తప్పించే ప్రయత్నంలో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ని బెదిరించి వీడియో రికార్డుచేయించి, కేసును ఉపసంహరించే ప్రయత్నం చేశాడన్న నేరారోపణపై వల్లభనేని వంశీని అరెస్టు చేసినట్లు సమాచారం. గురువారం రాత్రికి వంశీని విజయవాడలో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచి రిమాండుకు తరలిస్తారు.




లాయర్
ఫిబ్రవరి 14, 2025

# చిన్నారుల జీవితాలను నరకప్రాయం చేస్తున్న 'తలసీమియా'

నేటి సమాజం వ్యాధులకు పుట్టిల్లుగా ఉంటోంది. అన్నివర్గాల ప్రజలు, అన్నివయసుల వారు, పుట్టినప్పటినుంచి గిట్టేదాకా ఏదోఒక జబ్బుతో బాధలు పడేవాళ్ళే. ఇటీవలి కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్లు అనేకరకాల వ్యాధులను తెచ్చిపెడుతుంటే, వారసత్వంగా వచ్చే 'తలసీమియా'..వంటి భయంకర వ్యాధులు చిన్నారుల జీవితాలను నరకప్రాయం చేస్తున్నాయి. బోసినవ్వులతో అందరినీ అలరిస్తుండే చిన్నపిల్లలకు తలసీమియా వ్యాధి వచ్చిందంటే ఆ తల్లితండ్రులు పడే బాధ వర్ణనాతీతం. అందులోనూ తమకు తెలియకుండానే తమద్వారానే ఆ ప్రాణాంతకమైన వ్యాధి వచ్చిందంటే, ఆ తల్లితండ్రులు ఇంకెంత నరకం అనుభవిస్తారో చెప్పలేం. రక్తాన్ని పంచి ఇచ్చే తల్లితండ్రుల ద్వారానే ఆ వ్యాధి రావడం ఎంత దుర్భరం.. ఎంత దయనీయం?.. ఇంతకీ తలసీమియా వ్యాధి అంటే ఏమిటంటే, అదొక తీవ్రమైన వారసత్వ రక్త రుగ్మత అని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి తల్లితండ్రుల నుండి పిల్లలకు సంక్రమిస్తుంది. ఎర్రరక్త కణాల్లో ముఖ్యభాగమైన హిమోగ్లోబిన్ అనే ప్రొటీన్‌ను శరీరం తగినంతగా తయారుచేయలేనప్పుడు వచ్చే వ్యాధి ఇది. అందుకే, ఈ వ్యాధిగ్రస్తులకు తరచూ తప్పనిసరిగా రక్తమార్పిడి అవసరం అవుతుంది. ఈ వ్యాధిలో తలసీమియా మైనర్, మేజర్, మధ్యస్తం అనే మూడు రకాలున్నాయి. ముఖ్యంగా, మేనరికపు వివాహాల వల్ల ఈ వ్యాధి వస్తుందని, కనుక వివాహాలు చేసుకునేవారు ముందుగా తగు జాగ్రత్తలు తీసుకుని వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు చేయించుకోవడం ద్వారా ఇలాంటి వ్యాధులు తమ బిడ్డలకు రాకుండా చూసుకోవాలని వైద్యనిపుణులు ఎంతోకాలం నుంచీ హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ, వినేవారు లేరు. తీరా, బిడ్డలకు ఆ భయంకర వ్యాధి వచ్చాక.. తల్లితండ్రులు ఆ బిడ్డల్ని బతికించుకునేందుకు ఎన్ని బాధలు పడుతుంటారో చెప్పలేం. పొరపాటునో, గ్రహపాటునో ఏ బిడ్డకైనా తలసీమియా వ్యాధి వస్తే, ఇక పుట్టినప్పటినుంచి ఆ బిడ్డ చుట్టూతా వైద్యులు, మందులు, ఎప్పటికప్పుడు ఇచ్చేందుకు రక్తం అన్నీ అన్నివేళలా సిద్ధంగా ఉండాలి. రక్తదాతలను కూడా ముందుగానే చూసుకోవాలి. బతికినంతకాలం ప్రతి విషయంలోనూ ఆ చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఇన్ని బాధలు పడినా ఆ వ్యాధి పూర్తిగా నయమవుతుందో లేదో చెప్పలేం. దీంతో, ఆ బిడ్డలు పడే బాధ, తల్లితండ్రులు పడుతున్న వేదనా రోదనలకు మాటల్లేవు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య కోట్లల్లోనే ఉంది. మనదేశంలోనూ సుమారు 4 నుండి 6 లక్షల మంది దాకా తలసీమియా వ్యాధిగ్రస్తులున్నారని ఒక అంచనా. అంతేకాదు, ప్రతిఏటా సుమారు 15 నుంచి 20వేల మంది వరకు తలసీమియా వ్యాధిగ్రస్తులు పుడుతూనే ఉన్నారని కూడా గణాంకాలు చెప్తున్నాయి. ఈ వ్యాధి వస్తే ఆ చిన్నారుల్లో ఎదుగుదల ఉండదు. పొట్ట ఉబ్బిపోతుంటుంది. తల నిలబడకుండా వాలిపోతుంటుంది. ఎముకల్లో పటుత్వం తప్పిపోతుంది. నీరసం, రక్తహీనత..ఇలా ఎన్నో అనారోగ్యాలతో నిరంతరం వైద్యుల పర్యవేక్షణలోనే గడపాల్సి ఉంటుంది. లేదంటే ఆ బిడ్డ పరిస్థితి అయోమయంగానే ఉంటుంది. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరికైనా ఈ వ్యాధి వస్తే ఆ కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. ఇకనైనా ఆ వ్యాధిగ్రస్తులను ఆదరించి ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు పెద్దఎత్తున సమాయత్తం కావాలి. తల్లితండ్రులకు తెలియకుండానే బిడ్డలకు వారసత్వంగా వచ్చే ఈ ప్రాణాంతకమైన వ్యాధి నుంచి ఆ బిడ్డలను కాపాడేందుకు ప్రభుత్వాలు బృహత్ ప్రణాళికలను అమలుచేయాలి. ప్రత్యేక ఆసుపత్రులను నెలకొల్పి వారికి చికిత్సలందించాలి. వైద్యబృందాలు, సామాజిక సేవాపరాయణులు, స్వచ్ఛందసంస్థలు అందరూ కలసికట్టుగా మానవతా దృక్పథంతో బాధితులకు అన్నివిధాలా సాయమందించాలి. ముఖ్యంగా ఆ వ్యాధిని నయంచేసేందుకు అవసరమైన అన్నిరకాల చికిత్సలను ప్రభుత్వాలు ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలి. కన్నబిడ్డలు అనుక్షణం పడుతున్న బాధలను కళ్ళారాచూస్తూ నిరంతరం కన్నీటిమయం అవుతున్న ఆ తల్లితండ్రులకు మేమున్నామంటూ ప్రతిఒక్కరూ వారికి ధైర్యం చెప్పి ఓదార్చాలి. ఆపదలో ఉన్న వారిని కాపాడితే..ఆ పుణ్యం వేయిజన్మలకైనా తరగదంటారు. 'దయగల హృదయమే భగవన్నిలయం' అంటారు పెద్దలు. అలాంటి దయ కలిగిన, మానవీయ హృదయం కలవారు ఎక్కడున్నా.. ఒక్కసారి తలసీమియా బాధితుల వైపు దృష్టిసారించాలి. దుర్భరమైన ఆ వ్యాధితో బాలల జీవితాలు కొడిగట్టిపోకుండా ప్రభుత్వాలతో పాటు.. దాతలు, రక్తదాతలు తమ రెండుచేతులూ అడ్డుపెట్టి వారిని కాపాడాలి!..

## ఢిల్లీ ఫలితం ఆర్థిక నేరగాళ్ళకి గట్టి గుణపాఠం!

సామాన్యుడి ముసుగులో రాజకీయాలలో ప్రవేశించి అసామాన్య ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న వారికి ఢిల్లీ ఫలితాలతో గట్టి గుణపాఠం చెప్పినట్లుగా అయ్యింది. అర్థంలేని ఉచితాలతో ప్రజలని సోమరిపోతులని చేసి, తాము మాత్రం అడ్డదారుల్లో దొరికిన మేరకి దోచుకుంటున్న వాళ్లకి ఈ ఎన్నికల తీర్పు చెంపపెట్ట లాంటిదని చెప్పవచ్చు. ఇలాంటి వారు తమ స్వార్థం కోసం రాష్ట్ర పురోగతినీ, ప్రజల భవిష్యత్‌నీ తాకట్టుపెడతారు. రాష్ట్ర ఆర్థికస్థితిని అంధకారంలోకి నెట్టేస్తారు. తామూ తమ కుటుంబ సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తారు. పెళ్ళి, కుటుంబం, సంసారం లేకపోయినా ధనార్జనే లక్ష్యంగా తమిళనాడుని అధోగతిపాలు చేసిన జయలలితే అందుకు పెద్ద ఉదాహరణ. ఇప్పుడు ఆమె ఆస్తులన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమ్‌ఆద్మీ పార్టీ అని పేరుపెట్టి శేషమహల్ పేరుతో విలాసవంతమైన భవనాలు, మద్యం పాలసీతో వందలకోట్ల రూపాయల కుంభకోణాలు చేసిన కేజ్రీవాల్ పార్టీకి ఢిల్లీ ఓటర్లు తగిన బుద్ధి చెప్పారు. ఆంధ్రాలో మొన్నటివరకూ జగన్‌మోహన్‌రెడ్డి చేసింది కూడా అదే. అందుకే అక్కడ కూడా ఓటర్లు తగిన తీర్పు చెప్పి వైసీపీని ఓడించారు. ఏ ప్రభుత్వమైనా ఉచితాలని ప్రోత్సహించడం మంచిదికాదు! – *యం. చంద్రమౌళి,* **కొత్త ఢిల్లీ.**

## ముద్ర పడకముందే వెళ్ళిపోతే మంచిది!

అమెరికాలో కొత్తగా ఎర్పడిన డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సంచలనాత్మకం అవుతున్నాయి. ముఖ్యంగా ఆ దేశంలో అక్రమంగా ఉంటున్న వారి పైన ఆయన కొరడా ఝుళిపిస్తున్న తీరు విమర్శనాత్మకమవుతోంది. అయితే, ట్రంప్ నిర్ణయాన్ని సమర్ధిస్తున్న వారూ లేకపోలేదు. అక్రమ నివాసం ఏ దేశంలోనైనా నేరమే కదా..! కాబట్టి, ట్రంప్ తీరుని తప్పుపట్టలేం కూడా. అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న భారతీయులు తమ దేశంలో వేలల్లో వున్నట్లు లెక్కతేల్చింది ట్రంప్ ప్రభుత్వం. వాళ్ళంతా ముందే అప్రమత్తమైతే మంచిదన్నది నా అభిప్రాయం. అమెరికా ప్రభుత్వం వాళ్ళని పట్టుకుని నేరగాళ్ళుగా ప్రపంచానికి చూపించకముందే, వాళ్ళే దేశం విడిచి వెళ్ళిపోతే అది వాళ్ళకే మంచిది. అలా కాకుండా ప్రభుత్వం అక్రమ వలసదారుడిగా ముద్రవేసి దేశం నుండి పంపించివేస్తే, వాళ్ళు ఇంకెప్పటికీ ఈ దేశానికి తిరిగి రాలేరు. – *ఎన్. కే. రెడ్డి,* **శాన్ డియాగో, కాలిఫోర్నియా.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## రంగరాజన్‌పై దాడి అమానవీయం!

హిందూత్వాన్ని అడ్డంపెట్టుకుని అరాచకాలు చేస్తున్న వారు ఎవరైనా క్షమించకూడదు. తాజాగా చిల్లకూరు ఆలయ ప్రధానఅర్చకులు రంగరాజన్‌పై జరిగిన దాడి హేయనీయం. రామరాజ్యం కోసం సైన్యాన్ని తయారు చేస్తున్నానంటూ వీరరాఘవరెడ్డి అనే వ్యక్తి ఈ దుర్మార్గానికి పాల్పడినట్లు పోలీసులు చెప్తున్నారు. మతం పేరుతో మారణహోమం చేస్తున్న ఆ పైశాచికుడిని పోలీసులు అరెస్టు కూడా చేశారని వార్త. ఇలా మతం పేరు చెప్పుకుంటూ దాడులకిదిగుతూ హిందుత్వ ధర్మాన్ని మంటకలుపుతున్న ఇలాంటి నీచులని కఠినంగా శిక్షించి శాశ్వతంగా కటకటాల వెనుక ఉంచడమే మంచిది. ఇలాంటివాళ్ళు బయట ఉంటే హిందుత్వ ఉనికికే ప్రమాదం! *వీ. జే. ఆర్. శర్మ,* **తిరుమల.**




## వేసవి తాపం.... తీరని శాపం!

మహాశివరాత్రి (రేపు ఫిబ్రవరి 26) వస్తే.. 'శివ శివా' అంటూ చలికాలం వెళ్ళిపోతుంది. ఆ తర్వాత మార్చి, ఏప్రియల్ నెలల్లో కొంత, మే నెలలో భరించలేనంత ఎండలు భగ్గుమంటాయి. అయితే, ఇదంతా ప్రతీ ఏటా జరిగేదే. అనాదిగా మనం చూస్తున్నదే. అయితే, మారుతున్న కాలంతోపాటు ఋతువులలో కూడా మార్పులు సంతరించుకుంటున్నాయి. చలికాలం సైతం పగటిపూట విపరీతమైన ఎండలు కాస్తూ వేడి పుట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మాత్రం యధావిధిగా చలి పులి విజృంభిస్తోంది.

ఈ ఏడాది కూడా శివరాత్రి రాకముందే ఇది శీతాకాలమా..? లేక ఎండాకాలమా? అన్నట్లుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నమైతే బయటికి వెళ్ళాలంటేనే భయమేసేంతగా వేడి తీవ్రత క్రమేణా పెరుగుతోంది.

సాధారణంగా మనదేశంలో జనవరిలో సగటు గరిష్ట ఉష్ణోగ్రత 24.11 డిగ్రీలైతే, ఈసారి జనవరిలో అది 25.53 డిగ్రీలుగా నమోదు కావడం చూస్తే, జనవరి నుంచే మండే ఎండలు కాచుకుని ఉన్నాయని తేటతెల్లమవుతోంది. అటు కురవాల్సిన వర్షాలు సక్రమంగా కురవక, ఎండలు మాత్రం మిడిమేళంగా ఉండడం ఇటీవలి కాలంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న పెనుమార్పుల వల్లనేనని వేరే చెప్పనక్కర లేదు. గత వందేళ్ళకాలంలో 2024వ సంవత్సరం అత్యంత వేడితో రగిలిపోయిన ఏడాదిగా రికార్డులకెక్కిందని వాతావరణ నిపుణులు అంటున్నారు. ఈ ఏడాదికూడా ఉష్ణోగ్రతలు ఉగ్రంగానే ఉండబోతున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. ఈసారి వేసవి మొదలుకాకముందే ఫిబ్రవరి నెలలోనే పలు జిల్లాల్లో గరిష్టంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడమే అందుకు ఉదాహరణ.

### స్వయంకృతాపరాధమే ఈ సెగలకు కారణం!

భగభగమండే ఎండలనుండి ఉపశమనం పొందడానికి చెట్టు నీడనైనా ఆశ్రయిద్దామంటే, మచ్చుకైనా ఒక్క చెట్టు కనపడడంలేదు. రోడ్ల విస్తరణ, భవన నిర్మాణాలు వంటి సాకులతో ఉన్న ఆ కాస్త చెట్లని కూడా నిలువునా నరికేస్తున్నారు. నగరాలన్నీ కాంక్రీట్ జంగిళ్ళుగా మారిపోతున్నాయి. అయితే, దీనంతటికీ కారణం మన స్వయంకృతాపరాధమే. ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచమంతా... ఆ మాటకొస్తే భూమండలమంతా ఇదే దుస్థితి. ఎక్కడో ఉన్న పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల సముద్రజలాలు వేడెక్కితే అన్ని దేశాల్లో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. ఇప్పటివరకు 'లానినో' ప్రభావం తటస్థంగా ఉంటుందని వాతావరణశాఖ చెప్తోంది. దీనిప్రభావంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లో రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఏదేమైనా, గతంలో ఎప్పుడూ లేనంతగా ఇటీవలికాలంలో వాతావరణంలో భారీమార్పులు వస్తున్నాయి. భూమిపై కార్బన్‌డయాక్సైడ్‌తో మిళితమైన వాయువు అధికమవుతోంది. అడవులు నరికేస్తున్నారు. మొక్కలు నాటడంలేదు. ప్లాస్టిక్ వంటి కాలుష్యకారకాలు సముద్రాల్లోనూ, భూమిమీదా అంతా లక్షల టన్నుల్లో పేరుకుపోతున్నాయి. ఇవన్నీ కలసి వెరసి పరిసరాలన్నీ కాలుష్యానికి గురై, వాతావరణ సమతుల్యత ఘోరంగా దెబ్బతింటోంది. ఫలితంగా.. ఎండలు మంటలుగా మారిపోయి ప్రపంచాన్ని కాలుస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. ఋతువుల క్రమాన్నే మార్చే దిశగా, ప్రకృతి వాతావరణం ఎంతగా దెబ్బతినిపోతోందో దీనినిబట్టి ఊహించుకోవచ్చు. అందుకే ఇప్పుడు మనదేశంలో ఈ చలికాలంలో చలిమంటలు వేసుకునే రోజులు పోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే, ఏప్రిల్–మే నెలలు వస్తే ఎండలు ఇంకెంత భగ్గుమంటాయో ఊహించుకోవచ్చు.

### మేలుకోకుంటే... మాడిపోతాం!

ఎండలు ముదిరితే ఎంత ప్రమాదమో మనకి తెలియని విషయం కాదు. ఇప్పటికే తాగునీటి వసతులు అంతంతమాత్రంగా ఉన్న ప్రాంతాలన్నీ గుక్కెడు నీటికి కూడా కటకటలాడాల్సి వస్తుంది. మరోవైపు అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉంటాయి. ముఖ్యంగా ఆరుబయట ప్రాంతాల్లో నిత్యం పొట్టకూటికోసం పనిచేసుకునే కష్టజీవులు విలవిలలాడిపోతారు. ఉపాధిహామీ పథకం ద్వారా కూలిడబ్బుతో పొట్టపోసుకునే కోట్లాదిమంది నిరుపేదలు వేడిమితో అల్లాడిపోతారు. అడవుల్లో ఉండే ఎన్నోరకాల జీవరాశులు, సున్నితమైన వన్యప్రాణులు ఎండలకు విలవిలలాడతాయి. అటవీప్రాంతాలకు నిప్పుల ముప్పు కూడా ఉంటుంది. గతంలో 35 డిగ్రీలకే బాబోయ్ ఎండలు అనుకునేవాళ్ళం. కానీ, గత ఏడాది 45 డిగ్రీలు దాటిపోవడాన్ని ప్రత్యక్షంగా అనుభవించాం. అయినా, గుణపాఠాలు నేర్చుకోలేకపోతున్నాం. ఏ ఏడాదికాఏడాది ఇలా ఎండవేడిమి నరకం చూపిస్తున్నా వృక్ష సంపదను కాపాడుకోలేకపోతున్నాం.

### మొక్కలని పెంచుదాం... పర్యావరణాన్ని కాపాడుకుందాం!

ప్రపంచమంతా ఇదే విపత్తును ఎదుర్కొంటున్నా పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ఏ దేశం కూడా ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపడంలేదు. ఓవైపు పరిశ్రమలు, మరోవైపు కోట్లసంఖ్యలో పెరిగిపోతున్న వాహనాలు, ప్రపంచాన్ని వణికిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు ఇవన్నీ ఈ అనర్థాలకి కారకాలు. ఎటుచూసినా కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. పరిసరాలు కలుషితమైపోతూనే ఉన్నాయి. వేసవి తాపం మానవాళి జీవితాలకు శాపంగా మారుతున్నా, వాతావరణాన్ని కాపాడుకునే విషయంలో ప్రపంచదేశాలు సైతం కళ్ళు తెరవడమే లేదు. ఆ దుష్ఫలితాలను మనమే కాదు.. రాబోయే భావితరాలు కూడా అనుభవించాల్సి వస్తుంది. ఎక్కడికక్కడ పర్యావరణాన్ని కాపాడుకుని, నేలతల్లిని చల్లగా చూసుకోవడం మినహా.. మరో మార్గాంతరం లేదు. ప్రభుత్వాలు, ప్రజలు, అన్నిదేశాల నిపుణులు కలసి భూతాపాన్ని నివారించి, నానాటికీ భయంకరంగా పెరిగిపోతున్న మండుటెండల నుంచి ప్రజలను కాపాడేందుకు ఇకనైనా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం అవసరం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇస్తున్న "అమ్మ పేరుతో ఓ మొక్క" పిలుపుకి స్పందించి మొక్కలు నాటడమే భవిష్యత్ తరాలకి మనమిచ్చే పెద్ద కానుక. కాబట్టి, "మొక్కలు పెంచుదాం... పర్యావరణాన్ని కాపాడుకుందాం!"

**- రాజశ్రీ**

# దేశంలో అటవీ విస్తీర్ణం పెరిగిందా? వివరాలేమిటి?

## - లోక్‌సభలో వేమిరెడ్డి ప్రశ్నలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా దేశ వ్యాప్తంగా అటవీ విస్తీర్ణం పెరిగిందా?.. డిసెంబర్ 2024లో విడుదలైన ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్-2023 ప్రకారం, 2021 నుంచి దేశంలోని అడవులు, చెట్ల విస్తీర్ణం 1445.5 చదరపు కిలోమీటర్ల మేర పెరిగిందనేది వాస్తవమేనా అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రత్యేకించి, ఆంధ్రప్రదేశ్‌లో అటవీ పెరుగుదల వివరాలేమిటి అని ఆయన ప్రశ్నిస్తూ, దేశంలోని పశ్చిమ, తూర్పు కనుమల్లో అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పట్టిందనేది నిజమేనా అని కూడా ఆయన అడిగారు. అందుకు కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ లిఖిత పూర్వక సమాధానమిస్తూ, 2021 గణాంకాలతో పోలిస్తే దేశంలో అడవులు, చెట్ల విస్తీర్ణంలో 1445.81 చదరపు కిలోమీటర్లు నికర పెరుగుదల ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో మొత్తం అటవీ, చెట్ల విస్తీర్ణం 8,27356.95 చదరపు కిలోమీటర్లని, ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25.17 శాతంగా నమోదై ఉందని తెలిపారు. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ (ఐఎస్ఎఫ్ఆర్)-2023 లెక్కల ప్రకారం, దేశంలోని అటవీ విస్తీర్ణం 7,15342.61 చదరపు కిలోమీటర్లు కాగా, అందులో పశ్చిమ కనుమలలో పర్యావరణపరంగా సున్నిత ప్రాంతాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. 2013-2023 మధ్య పదేళ్లలో దేశంలో 16630.25 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం పెరిగిందని వివరించారు. పశ్చిమ కనుమలలోని చాలా దట్టమైన అడవుల విభాగంలో 3465.12 చదరపు కిలోమీటర్ల పెరుగుదల ఉందని తెలిపారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2023 రిపోర్టు ప్రకారం 2021తో పోలిస్తే విజయనగరం జిల్లాలో అత్యధికంగా 35.35 చ.కిమీ, ప్రత్యేకించి నెల్లూరుజిల్లాలో 17.77 చ.కిమీ, కోనసీమ జిల్లాలో 10.68 చదరపు కిలోమీటర్ల పెరుగుదల ఉందని వివరించారు.

## మంత్రి లోకేష్ సారధ్యంలో...

# ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం!

## - కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ప్రాథమిక విద్యా విధానం గందరగోళానికి గురైందని, అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో విద్యారంగం అభివృద్ధి చెందుతోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన 117 జీవో ఉపసంహరణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని విపిఆర్ నివాసంలో విద్యాశాఖ అధికారులతో విద్యా ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నారా లోకేష్ సారధ్యంలో ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలను ప్రతిపాదనలపై చర్చించారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు వెనక్కి తీసుకొచ్చే విషయమై విద్యాశాఖ అధికారుల అభిప్రాయం కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6-8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30, అంతకంటే తక్కువగా ఉంటే సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, దాన్ని ప్రాథమిక పాఠశాలగా మార్చాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలు శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్, బేసిక్ ప్రైమరీ స్కూల్, మోడల్ ప్రైమరీ స్కూల్‌ల విధి విధానాలపై ఎమ్మెల్యే చర్చించారు. జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు, పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### దామరమడుగు స్కూల్ తనిఖీ :

అదేవిధంగా, దామరమడుగు ఉన్నత పాఠశాలను కూడా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సందర్శించి మధ్యాహ్న భోజన పథకం తీరు తెన్నులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 416 మంది విద్యార్థులు ఉన్న హైస్కూల్‌లో 283 మంది మాత్రమే హాజరవుతుండడం ఏమిటని ఇన్‌ఛార్జి హెడ్మాస్టర్ నరసింహారావును ఎమ్మెల్యే ప్రశ్నించారు. పాఠశాల నిర్వహణలో విద్యాకమిటీలు క్రియాశీలకంగా వ్యవహ రించాలని, తల్లితండ్రులు కూడా తరచూ పాఠశాలలకు వెళ్లి పాఠశాల పరిస్థితులను పరిశీలిస్తుండాలని ఆమె కోరారు.

# కూటమి ప్రభుత్వంలో.. పల్లెల ప్రగతి బాట!

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి బాట పడుతున్నాయని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల కొడవలూరులో 5లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో తట్టెడు మట్టి కూడా వేయలేని పరిస్థితిలో వున్న గ్రామీణ ప్రాంతాలలో పవన్‌కళ్యాణ్ పంచాయతీరాజ్ మంత్రి అయ్యాక కొత్తగా రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఒక్క కొడవలూరు మండలంలోనే గత 7 నెలలలో 6 కోట్ల 50 లక్షల రూపాయలు వ్యయమయ్యే అభివృద్ధి పనులు చేశామన్నారు. అనంతరం ఆమె షాదీమంజిల్‌ను సందర్శించారు. షాదీమంజిల్ ఆధునీకరణ పనులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో 10 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. అదేవిధంగా, కొడవలూరు మండల వ్యవసాయ శాఖ కార్యాలయం మరమ్మత్తుల కోసం 5 లక్షల రూపాయలు కేటాయించారు. స్థానిక ప్రాథమిక వైద్యశాలను సందర్శించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, అక్కడ వసతులు సరిగా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎంపి నిధుల ద్వారా ఆసుపత్రిలో టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## బుచ్చిలో మార్కెట్ సముదాయానికి శంకుస్థాపన

బుచ్చి పట్టణాభివృద్ధిలో భాగంగా ఇటీవల ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మార్కెట్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. గత కొన్నేళ్లుగా స్తంభించిపోయిన బుచ్చి అభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టేందుకు స్థానిక కౌన్సిలర్లు, నాయకులు తనతో సహకరించాలని ఆమె కోరారు. ఈ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా 60కి పైగా కుటుంబాలకు ఉపాధి లభించడమే కాక, బుచ్చి నగర పంచాయతీకి ఇదొక ఆదాయ వనరుగా మారుతుందన్నారు. దాదాపు 2కోట్ల రూపాయలు సిఎస్ఆర్ నిధులు వెచ్చించి బుచ్చి అభివృద్ధిలో భాగస్వాములైన తేజా డెవలపర్స్ యాజమాన్యానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. వ్యాపారులకు అసౌకర్యం కల్గకుండా ఈ మార్కెట్ సముదాయాన్ని వీలైనంత త్వరగా నిర్మించవలసిందిగా ఆమె అధికారులను కోరారు. బుచ్చి నగర పంచాయతి కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌ఖాన్, కౌన్సిలర్లు ప్రత్యూష, పుట్టా లక్ష్మీకాంతమ్మ, తాళ్ల వైష్ణవి పాల్గొన్నారు.



# తెలంగాణలోనూ తమ భక్తిని చాటుకున్న నెల్లూరీయులు!

## కొండగట్టు అంజన్నకు కోటి విలువైన ఆభరణాలు సమర్పించిన ఏఎంఆర్ కుటుంబం

తెలంగాణలోనూ మన నెల్లూరీయులు తమ ఆధ్యాత్మిక సేవాపరాయణత్వాన్ని, ధార్మికసేవాతత్వాన్ని చాటుకుంటూనే ఉన్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో దేవాలయాలకు తమవంతు కానుకలు సమర్పించుకుంటూనే ఉన్నారు. దానగుణానికి ప్రతీకగా నిలిచిన నెల్లూరుజిల్లాకు చెందిన ఏఎంఆర్ ఇండియా కంపెనీ ఛైర్మెన్ అల్లూరు మహేశ్‌రెడ్డి - రాధిక దంపతులు ఇటీవల తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో వెలసివున్న శ్రీ కొండగట్టు అంజన్నస్వామి దేవాలయాన్ని సందర్శించి, ఆలయానికి కోటి రూపాయల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వామివారికి అర్పించారు. స్వామివారి మూలవిరాట్‌కు రాగిరేకుపై బంగారు తాపడంతో అత్యద్భుతంగా రూపొందించిన 325 గ్రాముల కిరీటంతో పాటు, అంతరాలయంలోని గోడలకు 48.500 కిలోల వెండి తాపడాలు, అత్యద్భుతమైన మకరతోరణం తయారుచేయించి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయానికి అవసరమైన ఆభరణాల విషయమై ఆలయ అధికారి ఒకరు ఏఎంఆర్ సంస్థకు వివరించడంతో, అందుకు స్పందించిన ఆ సంస్థ అధినేతలు వెంటనే స్వామివారికి విలువైన ఆభరణాలు సమర్పించి, ఎంతో మహిమాన్వితమైన కొండగట్టు అంజన్నస్వామి పట్ల తమకున్న భక్తిని చాటుకున్నారు.

మహేశ్‌రెడ్డి కుమారుడు నితేశ్, కాబోయే కోడలు కీర్తితో పాటు, మహేశ్‌రెడ్డి చిన్ననాటి స్నేహితుడు నంబూరు మనోజ్, శ్రీమతి లత కుటుంబసభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.








# DSC 2025 అభ్యర్థులకు మెరిట్ స్కాలర్‌షిప్

నా తండ్రిగారైన రామసుబ్బయ్య గారు 40 సంవత్సరాలు
రాష్ట్ర ప్రభుత్వోద్యోగిగా విద్యాశాఖలో పనిచేసి 1979 నుండి 1995 వరకు
శ్రీ రామా B.Ed Institute నడిపి వేలాది మంది టీచర్స్‌ను తయారుచేసిన
పుణ్యమూర్తులు. వారి జ్ఞాపకార్థం శ్రీ రామసుబ్బయ్య రాఘవ
రామచంద్ర మెరిట్ స్కాలర్‌షిప్‌కు, D.Scకు అర్హులైన వారు
తమ మార్కుల జాబితా, ఆధార్, ఆదాయ ధృవీకరణ పత్రాల జెరాక్స్ కాపీలు
కొరియర్‌లో ఈ క్రింది చిరునామాకు పంపండి.

భవానీ శంకర్, రిటైర్డ్ వి.ఆర్.సి వైస్ ప్రిన్సిపాల్,
వి.ఆర్ B.Ed కాలేజి ప్రిన్సిపాల్, డోర్ నెం. 26-1-457,
బి.వి.నగర్, నెల్లూరు - 4. సెల్ : 98492 26086.

### పొదలకూరురోడ్డు పనుల జాప్యంపై..

# శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొదలకూరురోడ్డు పనుల్లో జాప్యం జరుగుతుండడం పట్ల నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆర్‌అండ్‌బి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొదలకూరురోడ్డు నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండడంతో పలువురు స్థానికులు ఆ విషయాన్ని శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఆయన వెంటనే ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్ చేసి, 24 గంటల లోపల రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కావాలని, లేకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాల మేరకు పనులు ఉండాలని కూడా ఆయన అధికారులకు సూచించారు.

# మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు

### -- డీఆర్ఓ ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు --



మార్చి 17 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి జె.విజయ భాస్కర్‌రావు సంబంధిత అధికారులకు సూచించారు. వచ్చే నెల 17 నుండి 31 వరకు పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులుతో ఈనెల 10న జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 నుండి 12.45 వరకు నిర్వహించే ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 33,434 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 174 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 1622 మంది ఇన్విజిలేటర్లను నియమించామని వివరించారు. వీటిలో 16 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా కూడా గుర్తించినట్లు చెప్పారు. ఆయా పరీక్షాకేంద్రాల వద్ద సరైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రెవిన్యూ అధికారులతో కూడిన ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పరీక్షలు జరిగే రోజుల్లో ఆయా కేంద్రాల సమీపంలో జెరాక్స్ షాపులను మూసివేయాలన్నారు. ఈ సమావేశంలో డీఇఓ బాలాజీరావు, జిల్లా ఒకేషనల్ విద్యాధికారి మధుబాబు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమావేశం

కావలిలోని జవహర్‌భారతి కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశం ఈనెల 11న నెల్లూరు పురమందిరంలోని వర్ధమాన సమాజం హాల్లో ఆత్మీయంగా జరిగింది. 1966-69 మధ్య ఆ కళాశాలలో డిగ్రీ చదువు కున్న సుమారు 60 మంది విద్యార్థులు కలిసి ఒకరికొకరు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆత్మీయ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యాదాత దొడ్ల రామచంద్రా రెడ్డి దాతృత్వంతో కావలిలో ఆ కళాశాలను స్థాపించి ఎందరో విద్యార్థులకు విద్యనందించారని కొనియాడారు. ఈ సమావేశంలో స్థానిక ప్రముఖులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, పెనుబల్లి హనుమంతరావునాయుడు, వేమారెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### ఆర్‌అండ్‌బి అధికారులతో..

# ఎంపీ వేమిరెడ్డి సమీక్ష

జిల్లాలో రహదారుల స్థితిగతులపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల సమీక్షా సమావేశం నిర్వహించారు. నెల్లూరులోని తమ నివాసంలో ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ, కావలి, నెల్లూరు ఇఇలతో మాట్లాడుతూ, జిల్లాలో రహదారుల పరిస్థితిపై ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన రహదారుల స్థితిగతులను తెలుసు కున్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# ఘనంగా 'మీనోత్సవం'



ఈనెల 11న 'మీనోత్సవం' కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 11న 'మీనోత్సవం' ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరులోని స్వర్ణాలచెరువులోకి ఎమ్మెల్యే 8 లక్షల చేపపిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, డివిజన్ ఇంఛార్జి పాలూరు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు బాబ్జి, ఉచ్చూరు సురేష్, ఈశ్వర్, కొండిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు..21న

నెల్లూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 21న జడ్పీ కార్యాలయంలో జరుగుతాయని జడ్పీ సీఇఓ విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఆరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సమావేశాలు నిర్వహిస్తామని, ఆయా శాఖల అధికారులు, జడ్పీ సభ్యులు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

# మూర్ఛవ్యాధిపై అవగాహన అవసరం

### - ఎనెల్ ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ హరితకుమారి -

మూర్ఛవ్యాధి పట్ల ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని నెల్లూరులోని ఎనెల్ హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ హరితకుమారి చెప్పారు. ఈనెల 10న అంతర్జాతీయ మూర్ఛవ్యాధి దినోత్సవం (ఎపిలెప్సీ డే) సందర్భంగా స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఎనెల్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మూర్ఛవ్యాధి రాకుండా ఉండాలంటే సరైన నిద్ర, ఆహారం, మంచి జీవనశైలితో జీవించాలన్నారు. మానసిక ఒత్తిడులకు, దురలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఒకవేళ తలకు గాయాలు తగిలినా, మెదడుకు సమస్యలున్నా వెంటనే తగు చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

# టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం



స్థానిక జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన జిల్లా తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రులు ఎంఎండీ ఫరూక్, ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, సర్వేపల్లి ఎమ్మెల్యే.. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులతో కలసి జిల్లా పార్టీ నూతన కార్యాలయం కోసం స్థల సేకరణ విషయమై చర్చించారు. అదేవిధంగా, జిల్లాలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి నాయకులు చర్చలు జరిపారు.

# స్విమ్మింగ్ విజేతకు.. ప్రశాంతమ్మ అభినందనలు



విజయవాడలోని కృష్ణానదిలో రాష్ట్ర స్థాయిలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో 1.5 కిలోమీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన నెల్లూరువాసి తులసి నాగరాజును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సన్మానించారు. నెల్లూరు టౌన్‌హాలులో పెన్నా స్విమ్మర్స్ ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని, విజేతను అభినందించారు. జిల్లా నుంచి 33 మంది రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనేలా శిక్షణ యిచ్చిన పెన్నా స్విమ్మర్స్ అసోసియేషన్ నిర్వాహకులను అభినందించారు.

# ఇరుకళల అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు



నెల్లూరు గ్రామదేవత, మూలాపేటలో చెరువు ఒడ్డున వెలసివున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోని హుండీలను ఈనెల 11న లెక్కించారు. డిసెంబరు 3 నుంచి ఈనెల 11వతేదీ వరకు భక్తుల కానుకల ద్వారా ఆలయానికి 4,44,846 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగింది. ఆలయ ఇఓ వి.గిరికృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మెన్ ఒట్టూరు సురేంద్రయాదవ్ పర్యవేక్షించారు.

# నిద్ర లేమితో సమస్యలు

### డాక్టర్ దీక్షాంతి నారాయణ్

తగినంత విశ్రాంతి లేకపోవడం, నిద్ర సరిగా ఉండకపోవడం వంటివి అనారోగ్యానికి దారితీస్తాయని నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రి సీనియర్ న్యూరాలజీ వైద్యురాలు దీక్షాంతి నారాయణ్ చెప్పారు. అంతర్జాతీయ ఎపిలెప్సీ దేని పురస్కరించుకుని ఈనెల 11న మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, నిద్రలేమి వల్ల తాత్కాలికంగా అలసట ఉండడంతో పాటు, మెదడుపై, నాడీకణాలపై కూడా దాని ప్రభావం ఉంటుందన్నారు. అందువల్ల అల్జీమర్స్, పార్కిన్సన్స్, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి ప్రమాదకరమైన సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా యాంత్రికమైన జీవనశైలిని మార్చుకోవాలని, రోజూ నిర్ణీత సమయానికి నిద్రపోవడం, వ్యాయామం చేయడం, మానసిక వత్తిడికి దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో న్యూరాలజీ నిపుణురాలు డాక్టర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ పెంచండి సారూ!..

• కళాకారుల వినతి

జిల్లాలోని నృత్యకళా కారులు, డప్పు కళాకారులకు ఇస్తున్న పెన్షన్‌ను పెంచాలని కోరుతూ ఈనెల 10న పలువురు కళాకారులు నెల్లూరులోని ప్రజాసమస్యల పరిష్కారవేదిక అధికారులకు వినతులు సమర్పించుకున్నారు. నృత్యప్రదర్శనలతో తమ జీవనం గడుపుకుంటున్నామని, అయితే వృద్ధాప్యంతో ఇబ్బందులు పడుతున్నామని, పెరిగిన ధరలతో జీవనం కష్టమవుతోందని వారు తమ ఆవేదనను అధికారులకు చెప్పుకున్నారు. ఈ పరిస్థితుల్లో తమ కుటుంబాల పోషణ కోసం పెన్షన్‌ను 4 నుంచి 6వేల రూపాయలకు పెంచాలని వారు విజ్ఞప్తిచేశారు.



## మంత్రి ఆనం నేతృత్వంలో..

# ఆత్మకూరులో అట్టహాసంగా అభివృద్ధి పనులు

### హాజరైన మంత్రులు నారాయణ, ఫరూక్, జనార్దన్‌రెడ్డి, సవిత, ఎంపీ వేమిరెడ్డి



ఆత్మకూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 9న ఆత్మకూరు పట్టణంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయి. రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఎం.డి ఫరూక్, సవిత, బీసీ జనార్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రాష్ట్ర టిడ్కో ఛైర్మెన్ వేములపాటి అజయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలతో పాటు జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆత్మకూరు టిడ్కో హౌసింగ్ కాలనీ ప్రజల కోసం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 20 లక్షలతో శ్రీ సీతారాములస్వామి వారి దేవాలయ నిర్మాణానికి మంత్రులు, ఎంపీ వేమిరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆత్మకూరులో జడ్పీ నిధులు రూ. 1.70 కోట్లతో నూతన పంచాయతీరాజ్‌అతిథి గృహ నిర్మాణానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎం.డి ఫరూక్ శంకుస్థాపన చేశారు. ఆత్మకూరులో ఆధునీకరించిన ఆర్‌అండ్‌బి అతిథి గృహాన్ని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం, మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు విద్యా కిట్లు అందించారు.

### ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే అభివృద్ధి పనులు

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ 2014 నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేలు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. 2014కు ముందు తన హయాంలో మొదలుపెట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ బడ్జెట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీలకు పెద్దపీట వేశారని చెప్పారు. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామిక వేత్తను తయారుచేయాలనే సంకల్పంతో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేస్తూ పలు పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహాకాలిస్తున్నట్లు చెప్పారు.

### జిల్లాలో రోడ్ల బాగుకు 37వేల కోట్లు

రహదారులు భవనముల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలకుల పాపాలతో రాష్ట్రంలోని రోడ్లన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అన్ని రోడ్ల మరమ్మతులకు, అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. 27వేల కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులకు 1120 కోట్లు నిధులు మంజూరు చేశామని, ఇప్పటివరకు 79శాతం పనులు జరిగాయని, 18వేల కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు పూర్తి అయినట్లు చెప్పారు. ఒక్క నెల్లూరుజిల్లాలోనే 4వేల కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలను పూడ్చేందుకు 37వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ, టిడ్కో ఇళ్ల సముదాయాల్లో రామాలయాలను నిర్మించాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం సంకల్పించడం గొప్ప విషయమన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆత్మకూరు నియోజకవర్గం తరహాలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకునేందుకు ఎమ్మెల్యేలు ప్రత్యేకశ్రద్ధతో పనిచేయాలని పిలుపునిచ్చారు. టిడ్కో కాలనీల్లో రామాలయాలు నిర్మించడం సంతోషదాయకమన్నారు. తాను ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ జిల్లాకు బీపీసిఎల్, ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టులు రావడం గర్వకారణమన్నారు. అనంతరం బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులతో మంత్రులు, ఎంపీ వేమిరెడ్డి సహపంక్తి భోజనాలు చేశారు.

### త్వరలోనే విమానాశ్రయం

జిల్లా ప్రజల చిరకాల వాంఛ.. విమానాశ్రయం నిర్మాణం త్వరలోనే చేపట్టడం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎన్ఎడి ఫరూక్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ భరోసా ఇచ్చారు. ఇటీవల వారు నగరంలోని రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులతో కలసి అభివృద్ధి కార్యక్రమాల విషయమై చర్చించారు. దగదర్తి ఎయిర్ పోర్ట్ కోసం ఇప్పటికే సేకరించిన 750 ఎకరాల్లో రన్‌వే నిర్మాణం నెలకొల్పేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సంప్రదించగా, ఆ అవకాశాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాన్ని పంపిస్తామని తెలిపారని వారు వివరించారు.

# వేదపండితులు, అర్చకులకు 'కామధేను' పురస్కారాలు



ఇందుకూరుపేటలోని శ్రీ లలిత మహేశ్వరి ఆశ్రమంలోఈనెల 10న వేద పండితులు, అర్చకులకు 'కామధేను పురస్కారాల'ను ప్రదానం చేశారు. కె.వి రమణాచారి జన్మదినోత్సవం సందర్భంగా రామాయణం మహేష్‌స్వామి అధ్యక్షత్వంలో, మైపాడు రాజా నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు జిల్లాల నుంచి వేద పండితులు, అర్చకులు పాల్గొని ఈ పురస్కారాలు అందుకున్నారు. 2013లో కామధేను పురస్కారాన్ని కెవి రమణాచారి నెల్లూరులో ప్రారంభించారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం, తూర్పుగోదావరి జిల్లా వేద పండితులు గన్నవరం శ్యామసుందర్, నెల్లూరుజిల్లాకు చెందిన ముదివర్తి శ్రీనివాసాచార్యులు, ప్రకాశం జిల్లాకు చెందిన నారాయణ వెంకటాచార్యులు, కర్నూలు జిల్లా నివాసి గరుడాద్రి వెంకట దత్తాత్రేయశర్మ, సూళ్ళూరుపేట శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి చెందిన కప్పర లక్ష్మణ్‌కుమార్‌శర్మ, గుంటూరు జిల్లా అర్చకులు చీమలమర్రి వెంకటసుబ్బారావుశర్మ, నెల్లూరు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అర్చకులు గట్టుపల్లి లలిత శివకుమార్‌స్వామి, తమిళనాడు కాంచీపురానికి చెందిన వెంకటాచలం కండతూర్, ఇందుకూరుపేటలోని అర్చకులు రామాయణం మణిశంకర్‌శర్మ, గూడూరు వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అర్చకులు సోలా కుమార్‌శర్మలకి కామధేను పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. జిల్లాలోని వివిధ బ్రాహ్మణ, అర్చక పురోహిత సంఘాలు, ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.




## బాలు గౌరవార్థం..

# చెన్నైలో 'ఎస్పీబీ రోడ్డు'!

### అధికారికంగా ప్రారంభించిన తమిళనాడు ప్రభుత్వం

భారతీయ సినీ గాయకుడు, మధురాతిమధురమైన స్వరంతో వేలాది పాటలను అద్వితీయంగా గానం చేసి శ్రోతలను ఉర్రూతలూగించిన గానగంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) సేవలను స్మరించుకుంటూ, ఆయనకు గౌరవసూచకంగా చెన్నైలో ఆయన నివసించిన నుంగంబాక్కం కామ్‌దార్ నగర్ మెయిన్‌రోడ్డును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సలై'గా తమిళనాడు ప్రభుత్వం నామకరణం చేసి, బాలు పేరును చిరస్మరణీయంగా ఉండేలా చేసింది. ఆ రోడ్డుకు ఎస్పీబీ పేరు పెట్టాలని బాలు తనయుడు ఎస్పీ చరణ్ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కోరగా, ఆమేరకు ఆ రోడ్డు పేరును మార్పు చేస్తామని స్టాలిన్ గత ఏడాది సెప్టెంబరు 25న ప్రకటించారు. ఈ నేపథ్యంలో, బాలు పేరుతో మార్చిన ఆ నామఫలకాన్ని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈనెల 11న ఆవిష్కరించడం విశేషం. ఈ కార్యక్రమంలో తమిళనాడు మంత్రులు కెఎన్ నెహ్రూ, సుబ్రమణియన్, పి.కె శేఖర్‌బాబు, చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియతో పాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి, కుమారుడు చరణ్, కుమార్తె పల్లవి, చెల్లెలు ఎస్పీ శైలజ, పెద్దసంఖ్యలో బాలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రపంచప్రఖ్యాత గాయకుడైన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అనేక భారతీయ భాషల్లో సుమారు 40వేలకు పైగా పాటలు పాడి సంగీతాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన సంగీత విద్వత్తుకు, మధుర గానానికి గుర్తింపుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అత్యున్నతమైన పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు సైతం లభించిన విషయం తెలిసిందే. అయితే, దురదృష్టవశాత్తూ 2020లో కరోనా మహమ్మారి వ్యాధి ఆయన్ను బలితీసుకోవడం బాధాకరం. అయితే, భౌతికంగా ఆయన లేకపోయినా, ఆయన పాటలు-మాటలు మాత్రం అందరి చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. ఆ మహోన్నత గాయకుని జ్ఞాపకం చేసుకుంటూ తమిళనాడు ప్రభుత్వం చెన్నై నగరంలో ఆరోడ్డును ఎస్పీబీ పేరుతో మార్చడం పట్ల సర్వత్రా సంగీతాభిమానులు, ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# మస్తానయ్యకి మంచి పదవి



ప్రముఖ పారిశ్రామికవేత్త.. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్)ను మంచి పదవి వరించింది. కేంద్ర మత్స్య-పశుసంవర్ధక-పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యునిగా ఆయన్ను భారత ప్రభుత్వం తాజాగా నామినేట్ చేసింది. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కేంద్ర మంత్రిత్వశాఖ సంప్రదింపుల కమిటీ సభ్యునిగా తనను నియమించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, రాజ్యసభ ఛైర్మెన్ జగదీప్ ధన్‌ఖడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఆ సభ్యత్వానికి తనపేరును ప్రతిపాదించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకి ఆయన తన ధన్యవాదాలు తెలిపారు.



# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

### - ఎమ్మెల్యే పాశిం సునీల్



వైకాపా నాయకుల మీద కక్షసాధింపు చర్యలు చేయాలనే ఆలోచనలో ఉంటే, పరిస్థితులు మరోవిధంగా ఉంటాయని, ప్రజల సంక్షేమమే ముఖ్యం కాబట్టి కక్ష సాధింపు చర్యలు చేయడంలేదని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 10న నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని మంగళపూరులో వాస్తవాలు లేకుండా మాట్లాడారని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం



కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైకాపా సానుభూతిపరులపై అక్రమ కేసులు పెట్టి వేధించడం దారుణమైన చర్య అని మాజీమంత్రి, నెల్లూరుజిల్లా వైకాపా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గూడూరు మండలం మంగళపూరులో వైకాపా సానుభూతి పరుడు సతీష్‌ను ఇటీవల ఆయన పరామర్శిం చారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఎంపీపీ గురవయ్య, వైకాపా నాయకులు పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

## వెట్టిచాకిరి చేయిస్తే... చర్యలు తప్పవు

### - 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్




నిర్బంధించి ప్రజలతో వెట్టిచాకిరి చేయించే వారు ఉంటే, అలాంటి వారి గురించి తెలపాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తాన్ బేగం తెలి పారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఇటీవల మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వెట్టిచాకిరి చేయించడం నేరమని, అలా చేయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ఆమె తెలిపారు. అప్పుగా నగదు ఇచ్చి, వారిచేత వెట్టి చాకిరి చేయించకూడదని, ఇలాంటివి జరగకుండా ప్రత్యేక చట్టం ఉందని చెప్పారు. జడ్జి రాజేష్, ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## గంటల వ్యవధిలోనే.. తల్లిదండ్రుల చెంతకు విద్యార్థినులు



గూడూరు రెండోపట్టణం, జానకిరాంపేట లోని ఏపి గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల సమయం నుండి అదృశ్యమయ్యా రంటూ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గూడూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, గూడూరు డిఎస్పీ శ్రీమతి గీతాకుమారి పర్యవేక్షణలో గూడూరు టూటౌన్ సి.ఐ జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి డక్కిలి మండలంలోని మాటమడుగు, శ్రీపురం గ్రామాలలో తమ బంధువుల దగ్గర ఉన్న విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో సి.ఐ శ్రీనివాస్‌ను డిఎస్పీ అభినందించారు.

## కోలాహలంగా 'కృష్ణచైతన్య' వార్షికోత్సవం



నెల్లూరులోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు ఇటీవల స్థానిక అనిల్‌గార్డెన్స్‌లో విద్యార్థుల కోలాహలంతో సందడిగా జరిగాయి. విద్యాసంస్థల వ్యవస్థాపకులు మరియు ఛైర్మెన్ డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి, విద్యాసంస్థల డైరెక్టర్ రాణాప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. అనంతరం, విద్యాసంస్థల ఛైర్మెన్ డా. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో డిగ్రీ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహ కంగా గోల్డ్‌మెడల్ బహుకరిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, 26 ఏళ్ల కిందట తమ గురువు కృష్ణారెడ్డితో కలిసి కృష్ణచైతన్య విద్యాసంస్థలను ఏర్పాటుచేశామని, 140 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ విద్యాసంస్థల్లో ఇప్పుడు సుమారు 17వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం తమకు గర్వకారణమన్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ.. రాష్ట్ర స్థాయిలో.. తమ సంస్థ ఖ్యాతిని ఇనుమడింపజేస్తు న్నారని అన్నారు. అనంతరం ఛైర్మెన్ ఆర్‌వి కృష్ణారెడ్డిని, ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని, డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డిని కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కళాశాల డీన్‌లు రామాంజనేయులురెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రమేష్, ఏఓ హరి, చిరంజీవి సుధారాణి, ఆ విద్యా సంస్థలకు చెందిన అన్ని క్యాంపస్‌ల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కళ్యాణ వైభవం...!




సూళ్లూరుపేట వాస్తవ్యులు బద్దెపూడి ధనంజయరెడ్డి - నీరజల కుమార్తె **డాక్టర్ తన్మయి - డాక్టర్ గోవర్ధన్** (ఉదయగిరి మండలం, గానుగపెంటపల్లి వాస్తవ్యులు చిన్న ఓబుల్‌రెడ్డి - సుబ్బలక్ష్మిల కుమారుడు)ల వివాహం ఫిబ్రవరి 7వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.






నెల్లూరు వాస్తవ్యులు శీలం తిరుపయ్య - అరుణకుమారిల కుమార్తె **ప్రత్యూష - దుర్గాప్రసాద్** (చిత్తూరుజిల్లా వాస్తవ్యులు తలారి గోవిందు - సరస్వతిల కుమారుడు)ల పరిణయం ఫిబ్రవరి 7వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. మాజీ కేంద్ర మంత్రివర్యులు, తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి - పనబాక కృష్ణయ్య కుటుంబసభ్యులు ఈ వివాహానికి హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. నవదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



## జానకిరామ.. రామాయణం 52

- ఊటుకూరు జానకి రామారావు



మునితో ఎవరో దివ్యపురుషుడు మాట్లాడుతున్నట్లుగా కనపడ్డది. ఆ దివ్యపురుషుడి కాళ్ళు నేలకు ఆనటంలేదు. ఆయన ఎక్కివచ్చిన రథం దివ్యమైన ఆకుపచ్చ వెలుగులు విరజిమ్మే గుర్రాలతో పూన్చబడి ఉంది.

అక్కడ ఉన్న లక్షణాలను బట్టి చూడగా అది దేవేంద్రుడి రథమని, వచ్చినవాడు మహేంద్రుడని రాముడికి అర్థమయ్యింది.

సీతాలక్ష్మణులను ఆశ్రమసమీపంలో బయట ఉండమని చెప్పి తానొక్కడే మునిని దర్శించడానికి లోనికి వెళ్ళాడు రామచంద్రుడు.

రాముని రాక గమనించిన దేవేంద్రుడు.. శరభంగునితో నేను ఇప్పుడే ఈయనకు కనపడరాదు, ఈయన వల్ల ఒక మహా కార్యం జరుగవలసి ఉంది, ఆ తరువాత మాత్రమే మాట్లాడ గలను అని పలికి అంతర్ధానమైనాడు.

రాముడిని చూసిన మహర్షి, రామా! నీ కోసమే వేచి ఉన్నానయా! ఇంద్రుడు తనతో రమ్మనమని అన్నా రాముడిని కలిసిన తరువాతే వస్తాను అని చెప్పాను.

నిన్ను చూశాను, నాకు చాలా సంతోషంగా ఉంది, ఇక ఈ శరీరాన్ని వదలి స్వర్గానికి పయనమవుతాను అని పలికాడు.

అప్పుడు రాముడు మునితో, స్వామీ! మాకు వాసయోగ్యమైన ఏదైనా ఒకస్థలాన్ని చూపించండి అని అడిగాడు.

అందుకు శరభంగమహర్షి, రామా! నీవు ఈ అరణ్యంలోనే నివసించే సుతీక్షుడు అనే ముని వద్దకు వెళ్ళు, ఆయనే నీకు అందమైన వనప్రదేశంలో వసతి ఏర్పాటు చేయగలడు అని పలికి హోమం చేసి అగ్నిలో ప్రవేశించారు శరభంగమహర్షి.

అగ్నికి పూర్తిగా ఆహుతి అయిపోయింది ఆయన శరీరం!!

అప్పుడు ఆ కుండం నుండి ఆయన దివ్యశరీరం ఊర్ధ్వలోకాల వైపు సాగిపోయి బ్రహ్మలోకంలో ప్రవేశించింది.

ఆ ఆశ్రమ వాటికలో ఉన్న మునులంతా రాముని చుట్టూ చేరారు.

(శరభంగుడితో ఇంద్రుడు ఒక విషయం చర్చించాడు. అది రాముని గురించిన రహస్యం. ముందు ముందు వస్తుంది.)

వారిలో రకరకాల సంప్రదాయాలు అనుసరించి తపస్సు చేసుకునేవారున్నారు. వారందరూ గుంపుగా ఒకచోట పోగై రాముడిని కలిసి ప్రార్థించారు.

రామా రక్షకా! నీవు తప్ప మాకెవరు దిక్కు? నీ వద్దకు భిక్షుకులుగా వచ్చాం, అర్థిస్తున్నాం మాకు ప్రభువు నీవే కదా!

ఇక్ష్వాకులే కదా అనాది కాలం నుండి మాకు దిక్కు. రామా మూడులోకాలలో నీవంటి మహాధనుర్విద్యావేత్త ఎవడూలేడు, అలాంటి నీ పాలనలో కూడా మాకు రాక్షసుల బాధలు తప్పటం లేదు.

మమ్ములను నీవే కాపాడాలి ప్రభూ! అని ముక్తకంఠంతో మొరపెట్టుకున్నారు వారంతా.

ఓ తాపసులారా మీరు నన్ను ఇలా ప్రార్థించకూడదు. ఆజ్ఞాపించండి. మీ కోరిక నెరవేరుస్తాను ఇక మీరు నిశ్చింతగా ఉండండి.

రాక్షసులు నా పరాక్రమం, నా తమ్ముడి పరాక్రమం ఇక ముందు రుచి చూస్తారు, మీరు గుండెల మీద చెయ్యివేసుకొని ఏ భయం లేకుండా మీమీ కార్యాలు చూసుకోండి అని అభయమిచ్చి అక్కడనుండి సుతీక్ష్ణ మహాముని ఆశ్రమం వైపుగా సాగిపోయాడు.

చాలాదూరం ప్రయాణం చేసి వారు ఆ ముని ఆశ్రమం చేరుకున్నారు.

రాముడిని చూడగానే ఆ ముసలి మునికి ఎక్కడలేని ఉత్సాహం ఉప్పొంగింది. ఒక్క ఉదుటున లేచి, రామా వచ్చావా! నీకోసమే చూస్తూ ఉన్నానయ్యా అని కౌగలించుకొన్నాడు.

మహర్షీ మాకు నివాసయోగ్యమైన ఒక స్థలాన్ని నీవు చూపగలవని శరభంగులవారు మాకు చెప్పారు. కావున మాకు ఆ చోటు చూపించండి స్వామీ అని ప్రార్థించాడు రాముడు.

ఆ మహర్షి రామా ఈ ఆశ్రమవాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. నీవు ఇక్కడే వసియించవచ్చు అని అన్నాడు.

ఆయన మాటలు విన్న రాముడు, ధనుర్బాణాలతో నేను ఇక్కడ ఉంటే ఆశ్రమ ప్రశాంతతకు భంగం కలుగవచ్చు. కావున వేరొక చోటు చూపించండి స్వామీ అని అడిగాడు.

అప్పటికే రాత్రి అయ్యింది. ముని ఇచ్చిన ఆహారాన్ని తీసుకొని అక్కడే విశ్రమించారు ముప్పురూ.

తెల్లవారగానే సుతీక్ష్ణ మహాముని వద్ద సెలవు తీసుకొని దండకారణ్యంలో నివసించే మునుల ఆశ్రమాలను చూడటానికి బయలుదేరాడు రాముడు.

అంతకుముందే వారందరికీ, మిమ్మల్ని రక్కసుల బారి నుండి కాపాడతానని అభయమిచ్చివున్నాడు రాఘవుడు.

ముగ్గురూ ఎప్పటిలాగే నడవసాగారు.

అప్పటిదాకా మౌనంగా ఉన్న సీతమ్మ, రామా నేనొక మాట చెపుతాను విను అన్నది.

మనిషికి కామం వలన మూడు రకాలైన వ్యసనాలు జనిస్తాయి.

వాటిలో మొదటిది అబద్ధమాడటం!

సత్యసంధుడవైన నీవు కలలో కూడా అసత్యమాడవు.

ఆ విషయంలో సందేహం లేదు.

ఇక రెండవది, పరుల భార్యలను కామించుట!

ఏకపత్నీవ్రతుడవైన నీవు అలాంటి పాపపు పని ఎప్పుడూ చేయవు. అలాంటి కోరిక నీకు ఇప్పుడు లేదు ఇకముందు కూడా కలుగదు. ఇది సత్యం.

ఇక మూడవది!

అకారణంగా వైరం పూని క్రూరంగా ప్రవర్తించటం.

నీకు రాక్షసులు ఏ అపకారం చేశారని వారితో వైరం పెట్టుకోవాలనుకుంటున్నావు?

నీకు ఏ అపకారం చేయనివారిని సంహరిస్తానని మునులకు ఎందుకు మాట ఇచ్చావు?

తాపస వృత్తినవలంబించి పదునాలుగేండ్లు అరణ్యంలో గడపటానికొచ్చాం. ఆ పని పూర్తి చేసుకొని తిరిగి వెళ్దాం, అయోధ్యకు వెళ్ళిన తరువాత మరల క్షత్రియ ధర్మం పాటించ వచ్చు, అడవిలో వద్దు.

నీ చేతిలో ఉన్న ధనుర్బాణాలు నీలో క్రౌర్య ప్రవృత్తిని పెంచరాదు. నీ సహధర్మచారిణిగా ధర్మం అని నాకు తెలిసింది నీకు చెప్పటం నా బాధ్యత, ధర్మమూర్తివి! నీకు తెలియని ధర్మమేముంది. అని హితవు పలికింది సీతమ్మ.

జనకరాజపుత్రి ఏ విధంగా మాట్లాడాలో ఆ విధంగానే మాట్లాడావు నీవు. కానీ, సీతా! వనాలలో కందమూల ఫలాలు తింటూ తపస్సు చేసుకొంటున్న మునులతో రాక్షసులు అకారణంగా వైరం పెట్టుకొని వారి తపస్సు భగ్నంచేసి, వారిని హింసించి చంపి తింటూ వుంటే నిస్సహాయులైన వారు నా వద్దకు వచ్చి మొరపెట్టుకున్నారు.

శరణు కోరిన వారిని రక్షిస్తాను అని ప్రతిజ్ఞ చేశాను. ఇప్పుడు ఆ ప్రతిజ్ఞ నుండి దూరంగా ఎలా జరిగేది? నీవేకదా చెప్పావు నాకు.. "పీడితులైన వారి దీనాలాపాలు వినబడకుండా ఉండ టానికే క్షత్రియులు ధనుస్సు పట్టుకుంటారు" అని.

సీతా, వారు అడగకపోయినా దుఃఖితులైనవారిని పాలించటం నా కర్తవ్యం. పైగా ఇప్పుడు మాట కూడా ఇచ్చాను.

నా ప్రాణాన్ని, నిన్ను, లక్ష్మణున్ని అయినా వదులుకుంటాను గానీ, ఇచ్చిన మాట తప్పను అని స్థిరచిత్తంతో పలికాడు రాముడు.

అలా పలికి ముందు నడిచాడు రామచంద్రుడు. ఆయన వెనుక సీతమ్మ, ఆవిడను అనుసరిస్తూ లక్ష్మణుడు నడుస్తున్నారు.

మునులందరితో కలసి ఆశ్రమ సముదాయానికి చేరుకొని అక్కడ కొంతకాలం వారితో కలిసి జీవించారు. ఆ ఆశ్రమ వాటికలోనే సీతారామలక్ష్మణులు పది సంవత్సరాల కాలం గడిపేశారు.

ఒకరోజు రాముడు సుతీక్ష్ణ మహాముని చెంత కూర్చొని, స్వామీ ఈ ఆశ్రమానికి దగ్గరలోనే అగస్త్య మహాముని కూడా ఉన్నారని మునులంతా చెప్పుకుంటూ ఉంటే విన్నాను. నాకు ఆ మహర్షిని దర్శించాలనే కోరిక కలిగింది.

ఆయన ఆశ్రమానికి దారి చూపండి అని అడిగాడు.

రామా నేనే ఆ విషయం నీకు చెప్పాలనుకున్నాను, నీవే స్వయంగా అడిగావు.

..(సశేషం)

# రాజకీయాల్లో నేరగాళ్ల నియంత్రణ కత్తిమీద సామే!

## మనసులో మాట 32

రాజకీయాలు-నేరగాళ్లు పాలు-నీళ్లలా కలిసిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో స్వచ్ఛమైన రాజకీయాలను చూడగలమా అన్న నిరాశ పౌరసమాజంలో వ్యక్తమవుతోంది. చోటా మోటా నాయకుల నుంచి మొదలు నియోజకవర్గం స్థాయి నేతల వరకు నేరాల్లో ప్రమేయం ఉండడంతో నేతలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. సివిల్ తగాదాల్లో తలదూర్చి, సెటిల్‌మెంట్లు చేసి డబ్బు సంపాదించడమే వ్యాపకంగా పెట్టుకునే నేతల సంఖ్య పెరిగిపోయింది. సమస్యను పరిష్కరించమని నేతల వద్దకు వెళ్తే డబ్బు పోగొట్టుకుని వచ్చే పరిస్థితి ఇప్పుడుంది. హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలకు పాల్పడే నేరగాళ్లను వెనకేసుకొచ్చే, వారికి అండగా నిలబడే, వారిని కాపాడే వారికి, వారిని అనుచరులుగా పెట్టుకునే నేతలకు కొదవలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు గమనార్హం. న్యాయస్థానం ఒక వ్యక్తిని క్రిమినల్ కేసులో దోషిగా నిర్ధారించిన తర్వాత చట్టసభలకు ఎలా ఎన్నికవుతారని ఇటీవల సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరగా పరిష్కరించాలని, దోషిగా నిర్ధారించిన రాజకీయ నాయకులపై జీవితపర్యంతం నిషేధం విధించాలని న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రభుత్వ ఉద్యోగి అవినీతి చేసినట్లు లేదా నమ్మకద్రోహానికి పాల్పడినట్లు నిరూపితమయితే ఆ వ్యక్తి ప్రభుత్వ సేవలో కొనసాగడానికి అనర్హుడని పరిగణిస్తున్నామని, అలాంటిది నేరం రుజువయిన వ్యక్తి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేయడానికి ఎలా అర్హుడని ప్రశ్నించింది. క్రిమినల్ రాజకీయాలు చాలాపెద్ద సమస్య అని సుప్రీంకోర్ట్ స్పష్టం చేసింది. నేరగాళ్లు చట్టసభలకు ఎన్నికయి వారే చట్టాలను సమీక్షించడమా అని నిలదీసింది. సుప్రీంకోర్టు వ్యక్తపరిచిన ధర్మాగ్రహం ప్రజల మనోభావాలకు దర్పణం పట్టినా నేరగాళ్లను రాజకీయాల నుంచి వేరు చేయడం కత్తిమీద సామే. అంతలా రాజకీయాలతో నేరగాళ్లు పెనవేసుకుపోయారు. ప్రస్తుత లోక్‌సభ సభ్యుల్లో 42శాతం మందిపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. 30 సంవత్సరాలుగా నేతలపై కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాదాపు 5వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రాజకీయ నేతలపై క్రిమినల్ కేసుల విచారణను వేగవంతం చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టులు పదేపదే ఆదేశిస్తున్నా అవి నత్తనడకన నడుస్తూనే ఉన్నాయి. చిన్న చిన్న సాంకేతిక అంశాలను సాకుగా చూపించి నేతలు తెలివిగా కేసులను వాయిదాలు వేయించుకుంటున్నారు. ఈలోగా మళ్లీమళ్లీ చట్టసభలకు ఎన్నికవుతున్నారు. ఒకసారి చట్టసభకు ఎన్నికయితే అధికారికంగా, అనధికారికంగా చాలా రక్షణ లభిస్తుంది. అధికారం చేతిలో ఉంటుంది కాబట్టి మిగిలిన వ్యవస్థలను, వాటిల్లోని మనుషులను బుజ్జగిస్తూ, శాసిస్తూ తమ పబ్బం గడిపేసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ నత్తనడకన సాగడానికి చాలా కారణాలున్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల విచారణను చేపట్టే ప్రత్యేక న్యాయస్థానాలు రోజువారీ కోర్టు విధులను కూడా నిర్వహిస్తున్నాయని, ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ అనేది ఆ కోర్టుల పనుల్లో ఒకటి మాత్రమేనని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల సత్వర విచారణ అంశంపై కోర్టు సహాయకుడిగా వ్యవహరిస్తున్న విజయ్ హన్సారియా చెప్పిన విషయం వాస్తవ పరిస్థితులకు దర్పణం పట్టింది. కోర్టు నిర్దేశించిన తేదీల్లో సాక్షులను ప్రవేశ పెట్టడానికి తగిన పకడ్బందీ చర్యలను ప్రాసిక్యూషన్ తీసుకోవడం లేదని, విచారణ న్యాయస్థానాలు కూడా ఉదారంగా వాయిదాలు వేస్తున్నాయని హన్సారియా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నిందితులు కోర్టు నిర్దేశించిన తేదీల్లో విచారణకు హాజరు కావడంలేదని కూడా ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్‌పై సీబీఐ నమోదు చేసిన కేసుల్లో పదేపదే వాయిదాలు పడుతున్న పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపశాసనసభాపతి రఘురామకృష్ణరాజు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లిన సంగతి ఈ సందర్భంగా గమనార్హం. చట్టసభలున్నది ప్రజా శ్రేయస్సును కోరే చట్టాలు చేయడానికి. సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసినట్లు – చట్టసభల్లో నేరగాళ్ళు సభ్యులయితే ఎటువంటి చట్టాలు రూపు దిద్దుకుంటాయి? వారు తమ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చట్టాలు చేసే అవకాశం ఉంటుంది లేదా ఉన్న చట్టాలను పలుచన చేసే అవకాశం ఉంటుంది కానీ, ప్రజా శ్రేయస్సుతో వారికేమి పని? ప్రస్తుత రాజకీయనేతలను చూస్తుంటే నేతిబీరకాయలో నేతి చందంలా ఉంది. ఈ వ్యక్తికి దూరంగా ఉండాలి, ఇతనొక రౌడీ, ఇతనొక చెడు వ్యక్తి, ఇతనిలో లేని దుర్లక్షణం లేదు అనుకున్న వారు రాజకీయ నేతలుగా చలామణి అవుతున్నారు. అవినీతిలో అధికార, విపక్ష నేతలన్న తేడా లేదు. పేరుకు వైరి పక్షాలుగా కనిపిస్తున్నా అవినీతి వ్యవహారాల్లో వారంతా చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్న సంగతి బహిరంగ రహస్యం. ఒక కార్పొరేటర్ స్థాయి నాయకుడు కూడా రూ.వందల కోట్ల ఆస్తులు పోగేసుకుంటున్నారంటే రాజకీయాల్లో అవినీతి ఎంత వేళ్లూనుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సామాన్యులు ఇళ్లు కట్టుకుంటున్నా, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నా నేతలు గద్దల్లా వాలి కమిషన్లు, లంచాలు, వాటాలు డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే ముప్పుతిప్పలు పెట్టడం పరిపాటిగా మారింది. ఈ నేరమయ రాజకీయాలకు విరుగుడు సర్వోన్నత న్యాయస్థానం చేతిలోనే ఉంది. సర్వోన్నత న్యాయస్థానం కొరడా ఝుళిపించనిదే సమస్య పరిష్కారం కాదు. నేరం రుజువయ్యేదాకా కాదు... నేర చరిత్రపై క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా ఎన్నికల్లో పోటీకి అనర్హులను చేసేలా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటేనే రాజకీయాల్లో ప్రక్షాళన సాధ్యం అవుతుంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# కమలం కళకళ!

(మొదటిపేజీ తరువాయి)

అదేఅదే.. సమకాలీన రాజకీయాల్లో తిరుగులేని భారతీయ జనతా పార్టీ.. అగ్నికి వాయువు తోడైనట్లు పార్టీ అమ్ముల పొదిలో మోదీ అనే బ్రహ్మాస్త్రం చేరడంతో ఎన్నికల్లో ప్రత్యర్థులను ప్రళయభీకర గర్జనతో మట్టికరిపించేస్తోంది. అప్రతిహత విజయాలు, నమ్మశక్యంకాని వ్యూహాలతో దేశాన్నంతటినీ ఆవహిస్తోంది. ప్రత్యర్థుల ఊహకు కూడా అందని విధంగా దూసుకుపోతూ తనకు ఎదురేలేదని చాటుతోంది. తాజాగా ఢిల్లీ గద్దెపై ఏకపక్ష విజయం సాధించి 27 ఏళ్ళ తర్వాత కాషాయజెండాను రెపరెపలాడించింది.

## హిందుత్వ పునాదులతో ప్రారంభమై..

ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) రాజకీయ విభాగంగా 1952లో శ్యాంప్రసాద్ ముఖర్జీ నేతృత్వంలో జనసంఘ్ ఏర్పాటైంది. ఇది తర్వాతి కాలంలో మరికొన్ని పార్టీలతో కలిసి జనతా పార్టీగా రూపుదిద్దుకుంది. అలాంటి సమయంలో 1975లో ఇందిరాగాంధీ జాతీయ అత్యవసర పరిస్థితి విధించడంతో దేశ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి జ్వాలలు ఎగసిపడ్డాయి. ఈ క్రమంలో జనతాపార్టీ కాంగ్రెస్‌ను ఓడించి (1977లో మొరార్జీదేశాయ్ నేతృత్వంలో) కేంద్రంలో గద్దెనెక్కింది. వాజ్‌పేయి విదేశాంగశాఖ మంత్రిగా, అద్వాని సమాచారశాఖ మంత్రిగా కీలక బాధ్యతలు చేపట్టారు. అయితే నాయకుల్లో విభేదాల కారణంగా రెండేళ్లలోనే జనతాపార్టీ ప్రభుత్వం కూలిపోవడంతో 1980లో వాజ్‌పేయి నేతృత్వంలో భారతీయ జనతాపార్టీ పురుడుపోసుకుంది. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురికావడం, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పట్ల సానుభూతి ఏర్పడడంతో 543 స్థానాలున్న లోక్‌సభలో బీజేపీ కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. వాజ్‌పేయి, అద్వాని వంటి ఉద్ధండులు కూడా ఆ ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అయితే, అద్వానీ రథయాత్ర, మురళీ మనోహర్ జోషి కాశ్మీర్-కన్యాకుమారి యాత్రతో క్రమంగా బలం పుంజుకుని 1999-2004 మధ్య ఎన్డీయే (నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్) పేరుతో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీనికి వాజ్‌పేయి నేతృత్వం వహించి ఐదేళ్ళూ దేశాన్ని పాలించిన తొలి కాంగ్రేసేతర ప్రధానిగా రికార్డు సృష్టించారు. తర్వాత తమ పాలనలో భారత్ వెలిగిపోతోందంటూ.. ఎన్నికల బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. తద్వారా పదేళ్ళపాటు బీజేపీ అధికారానికి దూరమైంది.

## మోదీ రాకతో మహాశక్తిగా మారి..

గుజరాత్‌ను తన పాలనతో అభివృద్ధికి చిరునామాగా మార్చి.. దేశం మొత్తం తనవైపు చూసేలా చేసుకున్న నరేంద్ర మోదీ.. వాజ్‌పేయి, అద్వాని శకం పూర్తయిన తర్వాత భారతీయ జనతాపార్టీకి ఆశాకిరణంలా మారారు. ఎప్పటికప్పుడు ప్రజల నాడిని తెలుసుకోవడంతో పాటు సంక్షేమంలో సాంకేతికతను జోడించి అభివృద్ధిని పరుగులు పెట్టించారు. తద్వారా దేశంలోనే తనలాంటి విజన్ ఉన్న నేత లేడంటూ పార్టీ అధిష్టానంతో సహా, ఆర్ఎస్ఎస్ కూడా ముక్తకంఠంతో నినదించేలా చేశారు. ఇదే అదునుగా ముఖ్యమంత్రి నుంచి ఏకంగా ప్రధానమంత్రి స్థాయికి చేరి ప్రపంచంలోనే అరుదైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఈక్రమంలో జీఎస్టీతో కొత్త రకం పన్నులను ప్రజలపై మోపారనే ఆరోపణలు ఎదుర్కొన్నా.. నోట్ల రద్దుతో ప్రజలందరినీ కష్టాల్లోకి నెట్టేశారనే విమర్శలొచ్చినా.. రాజకీయ ప్రలోభాలకు, పార్టీ ఫిరాయింపులకు మూలకేంద్రంగా మారారని విపక్షాలు మండిపడినా.. స్విస్ బ్యాంకుల్లో భారతీయులు దాచిన నల్లధనాన్ని ఎప్పుడు వెనక్కి తెస్తారంటూ ఎద్దేవా చేసినా.. ప్రజలు మాత్రం మోదీ వెంటే నిలబడ్డారు. అప్పటివరకు మౌనమునిగా ముద్రపడిన మన్మోహన్‌సింగ్ కంటే త్రీడీ మోదీకే తమ ఓటంటూ ఏకంగా హ్యాట్రిక్ విజయాలతో మూడుసార్లు కేంద్రంలో పాలనా పగ్గాలు అప్పగించారు.

## జాతీయవాదం.. మతవాదం.. అభివృద్ధి మంత్రంతో..

హిందూయిజం మూల సిద్ధాంతంగా ఏర్పడిన ఆర్ఎస్ఎస్ నుంచి పురుడు పోసుకున్న పార్టీ బీజేపీ. ఆ పార్టీ చిరకాల వాంఛ అయిన అయోధ్యలో రామమందిర నిర్మాణానికి చట్టపరమైన ఇబ్బందులు తొలగించడమే కాకుండా.. దాన్ని పూర్తి చేసి హిందూ సమాజంలో మోదీ చెరగనిముద్ర వేశారు. అలాగే కేదారనాథ్, భద్రీనాథ్, రామేశ్వరంలో తరచూ ప్రత్యేక పూజలు చేస్తూ తనలోని ఆధ్యాత్మిక భావాలను ఎప్పటికప్పుడు చాటుతుంటారు. ఇక హిందువులకు పరమ పుణ్యక్షేత్రమైన వారణాసిని తన నియోజకవర్గంగా ఎంచుకుని ఘన విజయాలు సాధిస్తున్నారు. అవసరమైనప్పుడు పాకిస్థాన్ సరిహద్దుల్లో సర్జికల్ స్ట్రయిక్స్ అంటూ జాతీయవాదాన్ని ప్రజల్లో తట్టిలేపే నేర్పు నమో సొంతం. ఇందులో భాగంగానే పత్యేక ప్రతిపత్తి నిచ్చే 370 ఆర్టికల్‌ను తొలగించి కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, అందులో



ఎలాంటి మినహాయింపులకు తావులేదని తేల్చేశారు. ఈ క్రమంలో ఎన్ని పార్టీలు వ్యతిరేకించినా.. కశ్మీర్ లోయలో అల్లర్లు చెలరేగినా మోదీ వెనక్కి తగ్గలేదు. పైగా కశ్మీర్‌కు ఏకంగా రాష్ట్రహోదానే తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం, అక్కడి స్థానిక నాయకులు వేర్పాటువాదాన్ని రెచ్చగొట్టకుండా కఠిన చర్యలు తీసుకుని దేశ భద్రతను పటిష్టం చేయడం ఆయన ఉక్కు సంకల్పానికి నిదర్శనం. ఫలితంగా దేశప్రజల్లో ఆయన విశేష ఖ్యాతినార్జించారు. ఇక అప్పటి వరకు యూపీఏ పాలనలో వెలుగు చూసిన 2జీ స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్ గేమ్స్ వంటి కుంభకోణాలు తన హయాంలో ఎక్కడా మచ్చుకైనా కనిపించకుండా మోదీ అత్యంత జాగురూకతతో వ్యవహించారు. అందుకే దేశంలోని ఏ నాయకుడూ కూడా మోదీని అవినీతిపరుడు అని విమర్శించలేని పరిస్థితి నెలకొంది. అదే ఆయన చరిష్మాను చెక్కుచెదరకుండా కాపాడుతోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక విదేశాంగ విధానంలో మోదీ ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయారన్నది కాదనలేని వాస్తవం. ప్రపంచంలో అగ్రరాజ్యాలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాతో ఎప్పటికప్పుడు సత్సంబంధాలు నెరుపుతూ ప్రధాని ప్రపంచ స్థాయి నేతగా గుర్తింపు పొందారు.

## ఢిల్లీ గెలుపుతో మరో మెట్టుకు చేరుకుని..

నిజానికి 2024 సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ మార్కుకు కొద్ది దూరంలో బీజేపీ ఆగిపోవడంతో.. అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ గతంలో మాదిరి మోదీ ఏకఛత్రాధిపత్యం ఇకపై సాధ్యం కాదనే విశ్లేషణలు వినిపించాయి. అయితే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మార్పులను ఎప్పటికప్పుడు తనకు అనుకూలంగా మార్చుకుని ప్రతిపక్షాలకు చుక్కలు చూపించడంలో పీహెచ్‌డీ చేసిన మోదీ... లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన ఇబ్బందులను నేర్పుతో త్వరితగతిన తొలగించుకున్నారు. ఈ క్రమంలో మిత్రపక్షాలను గౌరవిస్తూనే పార్టీ పటిష్టతపై దృష్టి సారించారు. తొలుత హర్యానా, తర్వాత మహారాష్ట్ర, తాజాగా ఢిల్లీలో కమలాన్ని వికసింపజేసి ఇది మోదీ యుగం అనే తరహాలో శాశ్వత కీర్తిని సంపాదించుకున్నారు.

## ఆప్‌ను ఊడ్చిపడేసి..

గత దశాబ్దకాలంగా దేశవ్యాప్తంగా తిరుగులేని విజయాలు సాధించిన మోదీ నేతృత్వంలోని బీజేపీకి ఢిల్లీకోటను బద్దలు కొట్టడం మాత్రం సాధ్యం కాలేదు. దీనికి ప్రధాన కారణం ఢిల్లీలో సామాన్యుడి పాలన అంటూ తెరపైకి వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ కొరకురాని కొయ్యగా మారడమే. అయితే మూడో పర్యాయం ఎలాగైనా ఆప్‌కు చెక్ చెప్పేందుకు మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లారు. ఆప్ ప్రభుత్వ పెద్దలు ప్రజల సొమ్ముతో శీష్ మహల్‌ను నిర్మించుకున్నారని, మద్యం కుంభకోణంలో పీకల్లోతు మునిగిపోయారని పెద్దఎత్తున విమర్శలు చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్‌ను పావుగా వాడుకుని కేజ్రీవాల్‌కు చుక్కలు చూపించారు. ఢిల్లీ గల్లీలో నెలకొన్న తీవ్రమైన పారిశుధ్య సమస్యలను ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా చేసుకున్నారు. అలాగే హస్తినలో వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో ఆప్ ఫెయిలయ్యిందంటూ మాటల తూటాలు పేల్చారు. ఇక యమునా నదీ జలాలను శుద్ధి చేసే విషయంలో ఆప్ ప్రభుత్వ చేతకానితనాన్ని ఎండగట్టారు. ఇక ఎవరూ ఊహించని విధంగా కేంద్ర బడ్జెట్‌లో వార్షికాదాయం రూ.12 లక్షలవరకు ఉన్న వారికి పన్ను మినహాయింపు ఇవ్వడం ద్వారా మధ్యతరగతి వర్గాన్ని పూర్తిగా ఆకట్టుకున్నారు. తద్వారా ఢిల్లీలో గత 27 ఏళ్లుగా అందని ద్రాక్షగా ఉన్న విజయాన్ని అందుకుని బీజేపీకి అపురూపమైన కానుకగా అందించారు. ఇదే క్రమంలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో ఎలాగైనా పాగావేసి.. దేశం మొత్తం కాషాయమయం చేయడమే ధ్యేయంగా వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా స్వతంత్ర భారత చరిత్రలో ఈ స్థాయి చరిష్మా ఉన్న నాయకుడు లేరు అనేలా మోదీ తన ప్రత్యేకతను చాటుకుంటూ బీజేపీని అజేయశక్తిగా మార్చేశారనండలో సందేహమే లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం బీజేపీని ఎదిరించే రాజకీయ శక్తి కానీ.. మోదీకి ఎదురునిలిచే నాయకుడు కానీ.. దేశంలో లేరంటే అతిశయోక్తి కాదేమో.....!

# హస్తం విలవిల!

(మొదటిపేజీ తరువాయి)

గల్లీస్థాయి నాయకులను కూడా నియంత్రించలేని అధిష్టానం ఉన్న పార్టీ. అదే.. అదే.. కొన్నేళ్లుగా హస్తవాసి బాగలేక.. అవసానదశకు చేరి.. గతం ఘనం.. నేడు హీనాతిహీనం అనే స్థాయికి చేరిన కాంగ్రెస్‌పార్టీ..! తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో చతికిలపడడంతో దేశంలో కాంగ్రెస్.. ఖేల్‌ఖతం! అనే మాట రాజకీయ వర్గాల్లో జోరందుకుంది.

## ఆకాశం అంతటి ఎత్తు నుంచి.. అధఃపాతాళానికి..

మహాత్మాగాంధీ, అంబేడ్కర్, నెహ్రూ, వల్లభాయ్ పటేల్, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి మహనీయులను.. దేశానికి అందించిన పార్టీ కాంగ్రెస్. స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ, సహాయనిరాకరణ , ఉప్పుసత్యాగ్రహం, శాసన ఉల్లంఘన, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలకు నాయకత్వం వహించి దేశానికే తలమానికంగా నిలిచింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో నిబద్ధత, నిజాయితీతో పాటూ ఏ అంశమైనా ప్రజాపక్షం అనే రీతిలో భిన్నాభిప్రాయాలకు పార్టీలో ప్రాధాన్యత ఇచ్చి ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం చెప్పిందనే ఘన కీర్తి సంపాదించింది. అయితే కాలక్రమేణా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, ముఖస్తుతి, కుటుంబ పార్టీ అనే ముద్రతో నానాటికీ దిగజారి నేడు కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని కాంగ్రెస్‌పార్టీ ఎదుర్కొంటోందన్నది కాదనలేని వాస్తవం. ఇలాంటి సమయంలో గాంధీ కుటుంబం వారసుడిగా, పార్టీలో అగ్రనేతగా ముందుండి నడిపించాల్సిన రాహుల్‌గాంధీ.. మోదీ లాంటి మహాశక్తి ముందు నిలవలేక విలవిల్లాడుతున్నారు. యూపీఏ హయాంలో మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మను చేసి సోనియా, రాహుల్‌గాంధీ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో.. కాంగ్రెస్‌కు దారీ తెన్నూ లేకుండా పోయిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అది క్రమంగా పెరిగి ప్రస్తుతం కాంగ్రెస్‌వైపు నిలబడే నాథుడే కరువయ్యే పరిస్థితి వచ్చిందని తేల్చి చెప్తున్నారు. ఇక వైఎస్. రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఎం కృష్ణ వంటి ఉద్దండ పిండాలు, మాస్ లీడర్లు రాష్ట్రాల్లో లేకపోవడం కూడా ఆ పార్టీకి మైనస్‌గా మారిందని భావిస్తున్నారు.

## జాతీయ స్థాయిలో ఒంటరి..

కాంగ్రెస్ పేరుకు జాతీయపార్టీ అయినా ఆ స్థాయి ప్రభను కోల్పోయి చాలా కాలమే అయ్యిందంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే కనుచూపుమేరలో ఆ పార్టీకి స్నేహహస్తం అందించే పార్టీయే ప్రస్తుతం కనిపించడం లేదు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కూడా ద్వితీయశ్రేణి పార్టీగా ఉండేందుకే ఆపసోపాలు పడుతుండడమే ఇందుకు కారణం. కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి అయిన బీజేపీ దాదాపు 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉండగా.. కాంగ్రెస్ కేవలం మూడు రాష్టాలకే కుంచించుకుపోవడం ఆ పార్టీ దుస్థితిని కళ్లకు కడుతోంది. ఇక ప్రధాన ప్రాంతీయ పక్షాలు అధికారం చెలాయిస్తున్న పశ్చిమ బెంగాల్, జమ్మూకాశ్మీర్, తమిళనాడులో కాంగ్రెస్‌పార్టీ ఉనికి మిణుగురు పురుగు తరహాలో కనిపిస్తోంది. పంజాబ్, గుజరాత్‌లలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నా.. గుర్తింపు మాత్రం నామమాత్రమే అనే వాదనలున్నాయి. ఇక దేశంలోనే పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ నీడన, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేన (ఉద్ధవ్‌థాక్రే వర్గం) పంచన, బిహార్‌లో ఆర్జేడీ అదుపాజ్ఞల్లో కాంగ్రెస్ ఉందన్నది కాదనలేని సత్యం. ఈశాన్యభారతంలో ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా కాంగ్రెస్ పతనం వైపు పయనిస్తోందని విశ్లేషకులు తెగేసి చెప్తున్నారు.

## తెలంగాణలో తగవుల మధ్య.. ఆంధ్రాలో ఆశల్లేని స్థితిలో..

ఇక తెలంగాణ రాష్ట్రం ఇచ్చినా.. పదేళ్ళు అధికారం కాంగ్రెస్‌కు అందని ద్రాక్షగానే మారింది. ఏడాది క్రితం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అధికారం దక్కించుకున్నా.. కాంగ్రెస్ మార్కు తగవులు, అసంతృప్తి, గ్రూపు రాజకీయాలకు మాత్రం తెరపడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైకి కనిపించకున్నా రేవంత్‌తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ గ్రూపులను కాపాడుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నట్లు సమాచారం. ఇక ఇటీవల కొందరు మంత్రులపై అసంతృప్తితో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్ శివార్లలో రహస్యంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు వార్తలు రావడం టీ-కాంగ్రెస్‌లో కల్లోలం రేపింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశమై నష్ట నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు సేకరించినట్లు వార్త. ఇక కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న సైతం కాంగ్రెస్‌లో రెడ్ల రాజ్యం నడుస్తోందని బహిరంగంగా విమర్శించి తానూ ఆ తాను గుడ్డముక్కనే అని నిరూపించుకున్నారు. ఇక ప్రస్తుతం అధికారం ఉండడంతో అసంతృప్తిని పైకి కనిపించకుండా కొందరు మేనేజ్ చేస్తున్నారని.. ఒకసారి అధికారం పోతే మాత్రం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం ఖాయమనే చర్చ సాగుతోంది. ఏదేమైనా కలహాల కాపురానికి పెట్టిందిపేరైన కాంగ్రెస్ నాయకులు పార్టీ ప్రతిష్ట ఎంత దిగజారుతున్నా తమ నైజాన్ని మాత్రం మార్చుకోవడం లేదు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో వెంటిలేటర్‌పై ఉన్న కాంగ్రెస్‌పార్టీ.. ఎన్నికల్లో అధికారం సంగతి పక్కనపడితే కనీసం డిపాజిట్లు సాధించాలన్నా మరో పాతికేళ్ళు వేచి ఉండాల్సిందేనన్నది రాజకీయ ఉద్ధండులు సైతం అంగీకరిస్తున్న వాస్తవం. తెలంగాణ ఏర్పాటు కోసం ఆంధ్రాను సోనియా చంపేశారనే కోపం.. క్షేత్రస్థాయిలో నాయకత్వ లేమి వంటి సమస్యలను అధిగమించి ఇప్పట్లో ఆ పార్టీ కోలుకోవడం అసాధ్యంగానే కనిపిస్తోంది.

## హస్తినలో శూన్యహస్తం

ఇక ఇటీవలి ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందనే వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తం 70స్థానాల్లో ఆపార్టీకి మరోసారి ఒక్కసీటు కూడా దక్కకపోవడం గమనార్హం. అగ్రనేతలైన రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కాలికి బలపం కట్టుకుని ప్రచారం చేసినా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. దీనికితోడు ఆరు గ్యారెంటీల పేరిట ఉచిత పథకాలను ఆప్, బీజేపీ కంటే అధికంగా ప్రకటించినా ఫలితం మాత్రం సున్నా. చివరికి ముస్లింలకు పట్టున్న 12 నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం మూడో స్థానం కూడా దక్కించుకోకపోవడం, చాలాచోట్ల డిపాజిట్లు గల్లంతు కావడం ఆ పార్టీ దుస్థితిని కళ్లకు కడుతోంది. మరికొన్ని ఎన్నికల్లో ఇదే పరిస్థితి ఎదురైతే ఆ పార్టీ నామరూపాల్లేకుండా పోవడం ఖాయమని సీనియర్ నాయకులు సైతం విశ్లేషిస్తున్నారు. ఈ విషయంలో ఆ పార్టీ అధిష్టానం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటుందన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోనే అంతమైందనుకున్న కాంగ్రెస్‌పార్టీ ఢిల్లీ ఎన్నికల ఓటమితో దేశవ్యాప్తంగా కూడా ఖతమే అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది..!

### ఫ్లోరైడ్ సమస్య తీరేందుకు

# తీసుకుంటున్న చర్యలేమిటి?

### రాజ్యసభలో బీఎంఆర్ ప్రశ్న



నెల్లూరుజిల్లాలోని ఉదయగిరి, కందుకూరు, కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంచినీరు కలుషితంగా ఉంటోందని, అందుకు ప్రధాన కారణమైన ఫ్లోరైడ్ సమస్య నివారణకు కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) ఈనెల 10న రాజ్యసభలో ప్రశ్నించారు. అందుకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ సహాయ మంత్రి సోమన్న సమాధానమిస్తూ, జలజీవన్ మిషన్ ప్రారంభించడానికి ముందు ఉదయగిరి, కందుకూరు మరియు కనిగిరి నియోజకవర్గాలతో సహా రాష్ట్రంలో ఫ్లోరైడ్ కాలుష్యం 261 ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించి, దాని నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా సాంకేతికపరమైన సాయం, ఆర్థిక సహాయం అందించి ఆ సమస్య నివారణకు రాష్ట్రాలకు మద్దతు ఇస్తుందని తెలిపారు. ఆ మేరకు 2019-20వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించిన రూ. 372 కోట్ల మొత్తంలో ఇప్పటికి 121కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా, 2020-21లో కేటాయించిన 790 కోట్లలో 419 కోట్లు, 2021-22లో కేటాయించిన 3182 కోట్లలో 234 కోట్లు, 2022-23లో 3458 కోట్లకుగాను 304 కోట్లు ఖర్చు చేశారని విశదీకరించారు. 2023-24లో ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించిన 6530 కోట్లలో రూ. 861 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఆదాలతో..ఆనం విజయ భేటీ



మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఇటీవల వారి క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పార్టీని బలోపేతం చేసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను చర్చించుకున్నారు. అనంతరం నెల్లూరు జిల్లా పార్టీ కమిటీలో నూతనంగా నియమితులైన నెల్లూరు రూరల్ నాయకులని మరియు నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారందరినీ ఆనం విజయకుమార్‌రెడ్డి ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి



రోడ్డు ప్రమాదాల్లో కేవలం నిర్లక్ష్యం వల్ల ప్రతి సంవత్సరం మనదేశంలో లక్షలాదిమంది మరణిస్తున్నారని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని నెల్లూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె. వేమారెడ్డి చెప్పారు. నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న స్థానిక మూలాపేటలోని వేద సంస్కృత ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఐ మాట్లాడుతూ, అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనదారులు వాహనాలు నడపడం మంచిది కాదని చెప్పారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యతగా భావించాలన్నారు. ఈకార్యక్రమంలో చెన్నై హాస్పిటల్స్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ అధినేత ఎస్.వి.రమేష్‌బాబు, చిత్ర దర్శకుడు ఎన్.సుధాకర్‌రెడ్డి, మోటివేటర్ టి.వెంకటేశ్వర్లు, స్కూలు ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



### ఢిల్లీలో విజయంతో..

# నెల్లూరులో బీజేపీ సంబరాలు

భారతీయ జనతా పార్టీ(బీజేపీ) 27ఏళ్ల తర్వాత ఢిల్లీలో ఘనవిజయం సాధించడంతో నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నాయకులు స్వీట్లు పంచి, టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ ప్రభుత్వ అవినీతికి గట్టి బుద్ధి చెప్పారని, మోడీ నాయకత్వాన్ని కోరుకుంటూ స్పష్టమైన తీర్పు ఇచ్చారని చెప్పారు. కేజ్రీవాల్ పాలనలో ప్రజలు అనేక సమస్యలతో కష్టాలు పడ్డారని, ముఖ్యంగా వాయు కాలుష్యం సమస్యతో కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురైందన్నారు. బీజేపీ నాయకుడు పి.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఢిల్లీ ప్రజలు అవినీతికి గట్టి సమాధానం ఇచ్చి, అభివృద్ధికి పట్టం కట్టే దిశగా బీజేపీకి భారీ మద్దతు ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీ, ప్రధాని మోడీ నేతృత్వంలో మంచి అభివృద్ధి సాధిస్తుందన్నారు. ప్రత్యేకంగా ఢిల్లీలోని తెలుగు ప్రజలు కూడా ఎన్డీఏ వైపు మొగ్గుచూపి, బీజేపీ విజయానికి సహకరించారని తెలిపారు. తెలంగాణలో కూడా ఎన్డీఏ బలం పెరుగుతోందని, దేశవ్యాప్తంగా మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో బీజేపీ విజయ పరంపర కొనసాగుతోందని తెలిపారు. బీజేపీ నాయకురాలు కందికట్ల రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, నాయకులు గడ్డం విజయ్‌కుమార్, నరసింహనాయుడు, పెంచలయ్య, పరశురాం, చిలకా ప్రవీణ్ కుమార్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు..సరస్వతీ నిలయాలు

### జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ






గ్రంథాలయాలంటే సరస్వతీ నిలయాలని, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. గూడూరు సమీపంలోని చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో దాత జొన్నా మోహన్‌కృష్ణ బ్రదర్స్ వారి సహకారంతో నిర్మించిన గ్రంథాలయ భవనానికి ఆమె ఇటీవల ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రంథాలయాల విద్యార్థులకు చదువుపై ఆసక్తిని, ఏకాగ్రతను పెంచుతాయన్నారు. ఈ గ్రంథాలయ భవనానికి సుమారు 10లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చిన జొన్నా మోహన్‌కృష్ణ, సునీతాదేవిలకు ఆమె అభినందనలు తెలిపారు. గూడూరు జడ్పీటీసీ సభ్యురాలు ఊటుకూరు యామిని, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదరికాన్ని జయించడం విద్యతోనే సాధ్యం!

### - ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



విద్యతో పేదరికాన్ని జయించవచ్చని, రేపటి కాలానికి ముందడుగు నేటి బాలలేనని, విద్యార్థులంతా శ్రద్ధగా చదువుకుని, అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆకాంక్షించారు. ఇటీవల కలిగిరి మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన 12వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ ఏపీ మోడల్ స్కూల్స్, ఆదర్శ పాఠశాలలు, నవోదయ లాంటి ఎన్నో ఉత్తమ విద్యలను అందించే విద్యాలయాలను నెలకొల్పడం జరిగిందని, అదేవిధంగా ప్రతి పంచాయతీ పరిధిలో ఎలిమెంటరీ స్కూల్, మరియు హైస్కూళ్లను కూడా ఏర్పాటు చేసి అందరికీ ఉచిత విద్యను అందిస్తోందని అన్నారు. ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధాన రహదారి నుండి స్కూలు ప్రాంగణంలో భవనాల వరకు సిసి రోడ్డు ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే కాకర్లను కోరగా, వెంటనే సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం, గత సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎమ్మెల్యే చేతులమీదుగా జ్ఞాపికలందజేశారు. తొలుత విద్యార్థుల భరతనాట్యం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

## టూకీగా...

### విడవలూరులో అంకమ్మతల్లికి అభిషేక సేవలు

విడవలూరులో వెలసివున్న శ్రీ అంకమ్మతల్లికి ఈనెల 9న ఆలయ అర్చకులు అత్యంతవైభవంగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేక సేవలు చేశారు. కుంకుమార్చన చేసి, రాత్రి పల్లకిసేవ చేపట్టారు. అమ్మవారిని దుర్గాదేవి అలంకారంలో కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్థానిక భక్త మండలి వారి భజనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

### పిడూరులో భూముల రీ-సర్వే పరిశీలన

మనుబోలు మండలం పిడూరు గ్రామంలో భూముల రీ-సర్వేని ఈనెల 11న నెల్లూరు ఆర్డీఓ నాగసంతోషి అనూష పరిశీలించారు. రీసర్వే పక్కాగా జరగాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా, రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. రీసర్వే పటిష్టంగా ఉంటే భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించవచ్చని ఆమె చెప్పారు.

### కండలేరులో పుష్కలంగా నీళ్ళు

రాపూరు మండలంలోని కండలేరు జలాశయం పుష్కలంగా నీటితో కళకళలాడుతోంది. ఈనెల 11వ తేదీనాటికి 53.686 టీఎంసీల నీటిమట్టం నమోదైందని జలాశయం ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. దీంతో పలు కాలువల ద్వారా రైతులకు అవసరమైన సాగునీటిని కూడా విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

### ఉదయగిరిలో ఆర్టీసీ సిబ్బంది రక్తదానం

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈనెల 11న నెల్లూరులో జరిగిన రక్తదానశిబిరంలో, ఉదయగిరి ఆర్టీసీ డిపోలోని 8మంది సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన కె.రామ్‌కుమార్, ఏవీబీరెడ్డి, పి.ఫణికుమార్, జె.పెంచలయ్య, ఎస్‌కె రసూల్, వి.విజయకుమార్, ఎం.సుమంత్, సాయిరాజాలను డిపో మేనేజర్ శ్రీనివాసులు అభినందించారు.

### రాపూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్

రాపూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ఈనెల 11న విద్యుత్‌శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించి, వినియోగదారుల సమస్యలు పరిష్కరించారు. డెప్యూటీ డీఇ సురేష్, ఏఇ కార్తీక్ తదితరులు పాల్గొని వినియోగదారుల నుంచి అర్జీలు తీసుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయడంతో వినియోగదారులు సంతోషించారు.

### మనుబోలులో శ్రీ బ్రహ్మేశ్వరస్వామికి పల్లకిసేవ

మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 11న మనుబోలులోని శ్రీ బ్రహ్మేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జనార్దనం నాగరాజాచార్యులు ఆధ్వర్యంలో అభిషేక పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### రేబాలలో అనాథలకు అల్పాహారం

బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల గ్రామంలోని అనాథాశ్రమంలో ఉన్న వృద్ధులకు క్రీమ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న అల్పాహారాన్ని, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు ఇజ్రాయిల్ తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు బత్తల శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

### కోవూరులో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 9న కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీయిజం, గొడవలు, ఘర్షణలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా మంచి ప్రవర్తనతో ఉండాలని, లేకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ రంగనాథగౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### ముసునూరు వద్ద ద్విచక్రవాహనదారులకు అవగాహన

కావలి రూరల్ మండలంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద ఈనెల 9న మోటారు వాహనాల్లో వెళ్ళేవారికి రవాణాశాఖ అధికారులు అవగాహన కలిగించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. అసిస్టెంట్ మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్లు కరుణాకరన్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com